S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 18 | సంచిక: 360 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## తెలంగాణ టీచర్లు, ప్రొఫెసర్లకు

# బ్రిటిష్ శిక్షణ

## ఎడ్యుకేషన్, టెక్నాలజీలో మరింత సహకారం

యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ ను కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని, జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. వారు సానుకూలంగా స్పందించారు.

- మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు
- సంసిద్ధత వ్యక్తం చేసిన బ్రిటిష్ హైకమిషనర్
- సీఎం రేవంత్‌రెడ్డితో లిండీ కామెరాన్ భేటీ
- విద్యార్థులకు సహకారిస్తామని హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు.

మిగతా 2 లో

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- 21 వేయి స్తంభాల గుడాలో తొలి బతుకమ్మ
- గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా సంబరాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి




**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు.

2

# ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

## ఇతర రాష్ట్రాల ఫోన్ల ఉపయోగింపు
## ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం

### కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య
### పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ



**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో

మిగతా 4 లో

# సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

### రాహుల్ విమర్శలను ఖండించిన ఈసీ
### అబద్ధాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం
### రాహుల్ విమర్శలపై మండిపడ్డ భాజపా నేతలు



**న్యూఢిల్లీ :** ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని

మిగతా 3 లో

## తప్పుడు ఆరోపణలు

- బంగ్లా చొరబాటుదారులకు అండ
- ఓట్లచోరీ ఆరోపణల వెనక ఇదే లక్ష్యం
- రాహుల్ తీరుపై మండిపడ్డ అమిత్ షా

3



# నువ్వెంత బచ్చాగాడివి

- జూబ్లీహిల్స్‌లో బచ్చాను పెట్టి గెలిపిస్తా
- అసెంబ్లీ ఎన్నికలు కాదు.. జూబ్లీహిల్స్ గురించి మాట్లాడు
- పార్లమెంటులో ఎన్ని వచ్చాయో లోకల్ బాడీలోనూ అంతే
- కేటీఆర్ విమర్శలపై భగ్గుమన్న మంత్రిపొంగులేటి

2





పదిరోజుల పాటు

# అసెంబ్లీ సమావేశాలు

బీఏసీ సమావేశంలో నిర్ణయం

.. వివరాలు 5లో



ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో

# విమర్శలు

3 పాటలను రాయించిన బీఆర్ఎస్
విడుదల చేసిన కేటీఆర్

3

## ప్రజలకు ముందుగానే

# పండుగ బోనస్

- జీఎస్టీ సంస్కరణలు స్వాగతిస్తూ అసెంబ్లీ తీర్మానం
- జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలకు ఎంతోమేలు
- 140 కోట్ల మందికి మేలు జరుగుతుంది
- ఇలాంటి సాహసం కేవలం మోడీకే సాధ్యం
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి :** జీఎస్టీ 2.0 సంస్కరణలను స్వాగతిస్తూ ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇది పేదలకు పెద్ద ఊరట కలిగించే అంశంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలో తొలిసారిగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభ తీర్మానం చేసిందని తెలిపారు. జీఎస్టీ 2.0 కొత్త శ్లాబుల వల్ల జరిగే ప్రయోజనాల గురించి శాసనసభ ద్వారా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. తన రాజకీయ జీవితంలో మొదటిసారి ఇలాంటి జీఎస్టీ సవరణలు చూశానని

మిగతా 5 లో

19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 2



# ప్రోటోకాల్ విస్మరించిన సిరిసిల్ల కలెక్టర్

**ఆదిశ్రీనివాస్ ఫిర్యాదుతో వివరణ కోరిని ప్రభుత్వం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయింది. బుధవారం ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరు కాకపోవడంతోపాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంవోకు ఆది శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనకు సంబంధించి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్ కు నోటీసులు జారీ చేసింది ప్రభుత్వం. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన తీరును సర్కార్ తప్పుబట్టింది. రోజురోజుకూ వివాదాస్పదంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మారుతున్నారని సర్కార్ సీరియస్ అయింది.ఓ భూ నిర్వాసితుడి విషయంలోనూ నిన్న కోర్టు ఆయనకు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో ఈరోజు(గురువారం) జిల్లావ్యాప్తంగా ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా నిరసన తెలిపారు బీసీ సంఘాల నేతలు. ఈ మేరకు కలెక్టర్ సంజయ్ ఝాకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం

## ఏఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా ప్రమోషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్పీలుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. అడిషనల్ ఎస్పీగా పదోన్నతులు కల్పిస్తూ అదే స్థానంలో కొనసాగాలని ఉత్తర్వులు ఇచ్చింది. వేములవాడలో ఏఎస్పీగా పనిచేస్తున్నశేషాద్రిని రెడ్డి అదే స్థానంలో అడిషనల్ ఎస్పీగా , బైంసాలో ఉన్న అవినాష్ కుమార్‌ను, ఏటూరునాగారంలో ఏఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను, భువనగిరిలో ఉన్న కంకణాల రాహుల్ రెడ్డిని, ఉట్నూర్‌లో ఏఎస్పీగా పని చేస్తున్న కాజల్ సింగ్‌కు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## లోకల్ అభ్యర్థి గుర్తింపులను తేల్చండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో లోకల్ అభ్యర్థి గుర్తింపు వివాదాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వనపర్తి జిల్లా విద్యార్థి శశికిరణ్ పిటిషన్‌పై న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూల్‌లో చదివినా శశికిరణ్‌ను తెలంగాణ కోటా కింద పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అడ్వకేట్ జనరల్ సమాధానంతో ఈ కేసు ముగించింది. విద్యార్థికి వెబ్ ఆప్షన్ ఇచ్చేలా, కౌన్సెలింగ్‌కు పిలవాలని హైకోర్టు సూచించింది. సైనిక్ స్కూల్‌లో చదివిన తెలంగాణ విద్యార్థులకు పదేళ్ల వరకు రాయితీ కొనసాగించాలని ఆదేశించింది. అనంతరం పిటిషన్ డిస్పోజ్ చేసింది.

## రాగల మూడురోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీచేసింది. సూర్యాపేట, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలుపడుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు సగటున సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించిందని ఉందని తెలిపింది. మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల నుంచి పశ్చిమ-మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సగటు- సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతుందని వాతావరణశాఖ వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్, పలు పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ముషిరాబాద్ పరిధిలోని భోలక్‌పూ-ర్‌లో 15.5 సెంటీ-మీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

## మరోమారు నగరంలో భారీ వర్షం

**లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరదనీరు.. వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** నగరంలో మరోసారి భారీ వర్షం అతలాకుతలం చేసింది. బుధవారం రాత్రికురిసిన వర్షం నుంచి తేరుకోక ముందే గురువారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, పంజాగుట్ట, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఐటీ- కారిడార్‌తో పాటు- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరికొన్ని గంటలపాటు- వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేందుకు అవకాశముండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.



# తెలంగాణ టీచర్లు, ప్రొఫెసర్లకు బ్రిటిష్ శిక్షణ

మొదటి పేజీ తరువాయి

అందించేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీ-ష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ- హైకమిషనర్ హైదరాబాద్



గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు- బ్రిటిష్ హైకమిషనర్ సీఎంకు వివరించారు. యూకే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను కో ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరించారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

మొదటి పేజీ తరువాయి

గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ బాధల నుంచి పుట్టిందని చరిత్రలో ఉందని వివరించారు. కొత్తగా కవులను, రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలు పాడేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా మన సంస్కృతి తెలిసేలా ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. బతుకమ్మ పండుగ చేసుకున్న తర్వాత చెరువులో వదలాలని...అందుకు తగిన ఏర్పాట్లు- చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పండుగపై అవగాహన కార్యక్రమాలు



చేపడుతామని తెలిపారు. బతుకమ్మ పండుగ ముఖ్య ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయంగా చేసుకోవాలని. ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు. మొదటిరోజు చేసుకునే ఎంగిలి పువ్వు బతుకమ్మ దగ్గరి నుంచి చివరి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెళ్లాలని సూచించారు. బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# నువ్వెంత బచ్చాగాడివి

**జూబ్లీహిల్స్‌లో బచ్చాను పెట్టి గెలిపిస్తా**

**అసెంబ్లీ ఎన్నికలు కాదు.. జూబ్లీహిల్స్ గురించిమాట్లాడు**

**పార్లమెంటులో ఎన్ని సీట్లు వచ్చాయో లోకల్ బాడీలోనూ అంతే**

**కేటీఆర్ విమర్శలపై భగ్గుమన్న మంత్రిపొంగులేటి**



**ఖమ్మం, సెప్టెంబర్ 18:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టం వచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీపై మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఎప్పటికో మూడున్నర సంవత్సరాల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కాకుండా.. త్వరలో వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల గురించి కేటీఆర్ ఆలోచించాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా అంటూ కేటీఆర్‌కి పొంగలేటి సవాల్ విసిరారు. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా? లేదా ఫారిన్‌లో ఉంటావా? అంటూ విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక ఎన్నికల్లో కూడా అంతే సీట్లు- వస్తాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. ఖమ్మం రూరల్ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి మళ్లీ ఎలా గెలుస్తారో చూద్దాం అని అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఎంత కష్టపడుతున్నారో అందరికీ తెలుసు. అధికారంలో ఉన్నపుడు వాళ్లకు కనిపించనిది, వినిపించనిది.. ప్రతిపక్షంలో కనిపిస్తుంది అంటే విడ్డూరం, హాస్యాస్పదంగా ఉంది. విభజన సమయంలో రాష్ట్రాన్ని ఇచ్చిన ప్రధాన పార్టీ కాంగ్రెస్. నాడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల పాలు చేసింది. మా ప్రభుత్వం పేదోళ్లకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే కొంతమంది విషం కక్కుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని పొంగులేటి అన్నారు. కమిషన్‌లు వచ్చే కాళేశ్వరం కట్టాలనుకున్నారు కానీ.. పేదోడికి డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు నేడు ఈ పరిస్థితి ఉండేది కాదు. పాముకు కోరల్లో మాత్రమే విషం ఉంటే.. మీకు ఒళ్ళంతా విషం ఉంటుంది. రెండు పర్యాయాలు మీకు బుద్ధి చెప్పారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు బుద్ధి చెప్పాలని పొంగులేటి ఫైర్ అయ్యారు. మీ కుటుంబ సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. మీ సోదరిమణి సమస్య, మీ బిడ్డ సమస్యను మా సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే యత్నం చేస్తున్నారు. మొన్న ట్విట్టర్ టిల్లు ఏదో మాట్లాడుతున్నాడు. మూడున్నర సంవత్సరాల తర్వాత ఎన్నికల గురించి కాదు మాట్లాడేది.. ప్రస్తుతం ఏం జరుగుతుందో తెలుసుకో. మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు, దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, గురించి నేను మాట్లాడను. కేటీఆర్.. ముందుగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి చూడు. బచ్చాగాడిని పెట్టి గెలిపిస్తా. మూడున్నర సంవత్సరాల తర్వాత నువ్వు ఇండియాలో ఉంటావా, ఫారిన్ వెళ్తావా చూడాలి. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బిఫామ్ తీసుకోలేదు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసినా ఏమి చేయలేకపోయాడు, నువ్వెంత బచ్చాగాడివి. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదు, ఇచ్చిన మాట కోసం నిలబడి నెరవేర్చే పార్టీ. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరు. తల కిందులూ పెట్టిన పార్లమెంట్ ఎన్నికల్లో మీకు ఎన్ని సీట్లు- వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే సీట్లు- వస్తాయని పొంగులేటి అన్నారు.



# హైదరాబాద్ బ్రాండ్‌ను కాపాడుకోవాలి

**దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టుకుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలని సూచించారు. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. దిశ సమావేశంలో ఎంపి ఈటెల రాజేందర్ సహా పలువురు నేతలు, కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలు ఢీ: ముగ్గురు మృతి

**మహబూబ్‌నగర్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ):** ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని కొత్తమొల్గర సమీపంలో గురువారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలానికి చెందిన ముగ్గురు ప్రయాణికులు ఆటోలో భూత్పూర్ వైపు వెళు న్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ కొత్త మొల్గర సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన సంపల్లి వంశీ (24), హైదరాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డి (57) ఘటనా స్థలంలోనే మృతి చెందారు.

# సింగరేణి ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అస్వస్థత

**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 18:** సింగరేణి భూగర్భ గనిలో ప్రమాదం చోటుచేసుకుంది. కేటీకే 5 ఇంక్లైన్ రెండో లెవెల్ వద్ద వెల్డింగ్ చేస్తున్న క్రమంలో నిప్పు అంటుకుని విషవాయువులు వెలువడ్డాయి. ఈ ప్రమాదంలో అన్వేశ్, ప్రదీప్ అనే ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు బాధితులను చికిత్స నిమిత్తం సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మొదటి షిఫ్ట్ ముగిసే సమయానికి ఈ దుర్ఘటన జరిగినట్లు- తెలుస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ, ఫైర్, సేఫ్టీ సిబ్బంది ముమ్మర సహాయక చర్యలు చేపట్టారు. గని లోపల పంప్ ఆపరేటర్ చిక్కుకున్నట్లు- అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 3



# ప్రభుత్వంపై బతుకమ్మ పాటలతో విమర్శలు

- 3 పాటలు రాయించిన బీఆర్ఎస్
- పాటలు విడుదల చేసిన కేటీఆర్







**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** ప్రభుత్వాన్ని విమర్శిస్తూ బీఆర్ఎస్ రూపొందించిన బతుకమ్మ పాటల సిడిని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. అవన్నీ రాజకీయ పాటలే కావడం గమనార్హం. పండగపూట సర్కారును విమర్శిస్తూ ఉయ్యాల అన్న చరణంతో ఈ పాటలను వండి వార్చారు. మార్పు మార్పని వలలో మ నలను ముంచిండ్రే వలలో.. అంటూ ఓ పాట.. మార్పు మార్పని మనం చేయి గుర్తుకు ఓటేస్తె అంటూ మరో పాట.. ఆరు గ్యారెంటీలు ఉయ్యాలో ఆగమే జేసిండ్రు ఉ య్యాలో.. అంటూ మరో పాటను కేటీఆర్ ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగ అంటే తెలంగాణ ఆత్మ.. ఈ గడ్డకు పరిమితమైన పూల సింగిడి. ఆడబిడ్డల పండుగ.. ఈ పండగపూట పురాణ గాథలు, కథలు, రామాయణ, మహాభారత ఘట్టాలను పాటలుగా పాడుతూ ఉంటారు. తరతరాలుగా వస్తున్న పాటల మాదిరిగా రాజకీయ విమర్శలను చేస్తూ పాటలు రాసి పాడించి మరీ వాటిని ఆవిష్కరించారు. ఈ పాటలు నిజంగా బతుకమ్మ దగ్గర పాడేలాన ఉన్నాయా? పాడుతారా? అనేది పక్కన పెడితే బతుకమ్మ లాంటి పండుగను కూడా రాజకీయ వేదికగా వాడుకునేందుకు యత్నిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. మొన్నటి వరకు బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసింది కవితమ్మ.. బ్రాండ్ అంబాసిడర్ ఆమెనే అంటూ చెప్పిన వాళ్లు సడెన్‌గా ఇవాళ మాటమార్చేశారు. బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని పాటల విడుదల సంద ర్భంగా చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బతుకమ్మ ను తెలంగాణ నుంచి వేరు చేసి రేవంత్ రెడ్డి మహిళల హృదయాలను గాయపరిచారన్నారు. ఈ నేల స్వభావం తెలిసిన పాలన మళ్ళీ రావాలన్నారు. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ మూడు పాటలను స్పెషల్‌గా రాయించామని చెప్పు కొచ్చారు. బతుకమ్మ పండుగను గొప్పగా నిర్వహించామని చెప్పారు. కోటి మంది మహిళలను బతుకమ్మ చీరలతో గౌరవించిన నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తన పాలనలో ఆడపడుచులను కన్నతండ్రిలా చూసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ మాయం చేశారంటూ విమర్శలు చేశారు. ప్రభుత్వ ఆఫీసుల్లో బతుకమ్మ ఆడుకునే అవకాశం కేసీఆర్ ఇచ్చారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బతుకమ్మ పండుగ కోసం లంబాడీ ఆడబిడ్డలు ఎదురు చూస్తుంటారని మాజీ ఎంపీ మాలోత్ కవిత చెప్పారు. తెలంగాణ జాగృతి సంస్థ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు బతుకమ్మ పండుగను కల్వకుంట్ల కవిత నిర్వహించే వారు. ఇందుకోసం ప్రత్యేకంగా పాటలు సిద్ధం చేసేవారు. అందులో రాజకీయాలకు తావులేకుండా బతుకమ్మ ప్రాశ స్త్యాన్ని వివరించే అంశాలే ఉండేవి. ఇప్పుడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విడుదల చేసిన బతుకమ్మ పాటలన్నీ రాజకీయ పాటలే కావడం విమర్శలకు తావిస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తాను పుట్టిన ఊరు చింతమడక ఆహ్వానించింది. ఈ నెల 21న నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు రావాలంటూ గ్రామస్తులు కవితను ఆహ్వానించారు. కవితను సిద్దిపేట జిల్లా చింతమడక వాసులు ఆహ్వానించడం విశేషం. తెలంగాణ భవన్‌లో రాజకీయ పాటలను బీఆర్ఎస్ విడుదల చేయడం, కవిత చింత మడకలో బతుకమ్మ పండుగకు వెళ్తుండటం హాట్ టాపిక్‌గా మారాయి.

## ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు

### కలెక్టర్‌తో మాట్లాడిన కెటిఆర్

### రైతులకు అన్యాయం చేస్తే మరో లగచర్ల అంటూ హెచ్చరిక

**వికారాబాద్, సెప్టెంబర్ 18:** రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు మారుస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. అలైన్‌మెంట్‌ను మార్చి రోడ్డు నిర్మాణం చేపడితే మరో లగచర్ల ఘటన రిపీట్ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కేటీఆర్ హెచ్చరించారు . గతంలో ఆమోదించిన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్‌ని మార్చి సర్వే నెంబర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గతంలో నిర్మించ తలపెట్టిన మార్గంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉండటంతో అలైన్‌మెంట్‌ను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలైన్‌మెంట్ మార్పుతో రైతులు భారీగా భూములు కోల్పోతున్నారు. ఈ విషయంపై వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేశారు అన్నదాతలు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని కేటీఆర్‌ను కలిశారు. మోమిన్‌పేట మండల గ్రామాల రైతులు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడారు కేటీఆర్. పేద రైతుల భూములను గుంజుకొని వారికి అన్యాయం చేస్తే మరో లగచర్ల ఘటన చోటు చేసుకుంటుందని కలెక్టర్‌ను హెచ్చరించారు. అయితే, కలెక్టర్‌ను హెచ్చరించిన వీడియో వికారాబాద్ జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.

# కొడుకు పెళ్లి రిసిప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

- రైతుల సంక్షేమంకోసం 2కోట్లు ఇవ్వాలని నిర్ణయం
- సిఎం రేవంత్‌ను కలిసి చెక్ అందచేసిన బత్తుల లక్ష్మారెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 18:** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదారత చాటుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రెండుకోట్లు విరాళంగా ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో సిఎం రేవంత్ రెడ్డికి అందించారు. తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ. 2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో వెంటనే సిఎంకు చెక్కును అందించారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

### యూరియా సరఫరాలో నిర్లక్ష్యం

### కేంద్రమాజీమంత్రి వేణుగోపాలాచారి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 18:** యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహర కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. తెలంగాణలో హుంకరిస్తున్న నేతలు ఈ నేలకు ఏంచేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. అనేక విషయాల్లో కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఈ సమస్య తెలంగాణకు సంబంధించిందే కాదని.. దాదాపు చాలా రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. ఆర్థిక సంఘం



బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులు తక్షణమే విడుదల చేయాలని కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.



# నేనంటే గిట్టని వారి దుష్ప్రచారం

### పార్టీ మారడం,రాజీనామా చేయడం అంటూ రూమర్స్

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరణ

**నల్లగొండ, సెప్టెంబర్ 18:** తనటే గిట్టని కొందరు వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ.. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారంపై స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతు న్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి?ఇవాళ కూడా ఓ ప్రైవేటు- కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు. నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తన పదవికి రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని లేదా కొత్త పార్టీ పెడుతున్నానని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. మా కుటుంబం ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీ నేపథ్యమే ఉన్న కుటుంబం. నాకు కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే గౌరవం ఉంది. కానీ నాకు, మా కుటుంబానికి గిట్టని కొందరు వ్యక్తులు కావాలనే ఈ రకాల ప్రచారం చేస్తున్నారు. మా ప్రతిష్ఠ దిగజార్చేందుకే ఈ రూమర్లు సృష్టిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకే తన వ్యాఖ్యలు ఉ ంటాయని, తన రాజకీయ భవిష్యత్తుపై తాను చెప్పకపోతే ఇతరుల మాటలను ఎవరు నమ్మొద్దని ఆయన హితవు పలికారు.

## వామనరావు దంపతుల హత్య కేసు

### మంథని కోర్టులో సమాచారం తీసుకున్న సిబిఐ



**పెద్దపల్లి, సెప్టెంబర్ 18 :** రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన అడ్వకేట్ వామన్ రావు దంపతుల హత్య కేసులో సిబిఐ విచారణ ప్రారంభమైంది. వామన్ రావు దంపతుల హత్య కేసుకు సంబంధించిన విచారణ నిమిత్తం గురువారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు మంథని కోర్టులో ప్రభుత్వ సమాచారాన్ని తీసుకున్నారు. అంతేకాకుండా వామన్ రావు స్వగ్రామమైన గుంజపడుగు వెళ్లి వివరాలను సేకరించారు. హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసులో ఏడుగురు నిందితులు బెయిల్‌పై ఉన్నారు. వామన్‌రావు దంపతుల హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే హస్తం ఉందని తండ్రి కిషన్‌రావు ఆరోపణల నేపథ్యంలో సిబిఐ అధికారులు విచారణ ప్రారంభించారు. అనంతరం మంథని కోర్టు ప్రాంగణంలో వామన్ రావు తండ్రి కిషన్ రావు, తమ్ముడు చంద్రశేఖర్ నుంచి వివరాలను సిబిఐ అధికారులు సేకరించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించనున్నారు.

## ఉత్తమ్ తండ్రికి సిఎం నివాళి



**హైదరాబాద్,సెప్టెంబర్18 :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి స్వర్గీయ ఎన్. పురుషోత్తం రెడ్డి 'సంవత్సర విమోకం' కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో ఉత్తమ్ ,ఆయనభార్య పద్మావతితదితరులు ఉన్నారు.

## విమాన రెక్కల్లో ఇరుక్కుపోయిన పక్షి

**విశాఖపట్నం, సెప్టెంబర్ 18:** ఈ మధ్యకాలంలో పలు విమానాలు పెను ప్రమాదాల నుంచి తృటిలో తప్పించుకుంటున్నాయి. తాజాగా ఎయిరిండియాకు చెందిన ఎక్స్‌ప్రెస్ విమానం పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు విమానం హైదరాబాద్‌కు బయలు దేరింది. టేకాఫ్ అయిన కొంత సమయానికే విమాన రెక్కలలో ఓ పక్షి ఇరుక్కుపోయింది. పక్షి ఇరుక్కోవడంతో విమాన ఇంజిన్ ఫ్యాన్ రెక్కలు దెబ్బ తిన్నాయి. ఇది గమనించిన పైలట్ చాకచక్యంగా విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నారు.

19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 4



## సంపాదకీయం



# అసెంబ్లీకి రాని నేతలు అవసరమా ?

తెలుగు రాష్ట్రాల్లో చాలా విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారం కోల్పోవడంతో విమర్శలే లక్ష్యంగా విపక్షంలో ఉన్న పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని ఎపిలో విపక్ష వైకాపా అధినేత జగన్ మొండిపట్టుతో ఉన్నారు. విపక్ష హోదా ఇవ్వండి అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. ఇక తెలంగాణలో విపక్ష హోదా ఉన్నా కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు. అధికారం ఉంటే తప్ప అసెంబ్లీలో అడుగు పెట్టేది లేదన్న ధోరణిలో ఉన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తరవాత అసెంబ్లీకి రావాల్సిందే. సమస్యలపై చర్చించాల్సిందే. అలా కాకండా జీతభత్యాలు మాత్రం ఠంచనుగా ఎత్తుకుంటున్నారు. ప్రజల సొమ్ము తింటున్న ఈ ఇద్దరు నేతలు ఇంత బాధ్యతారహితంగా ఉంటున్నారు. ఇలాంటి సమయాల్లో చట్టప్రకారం ఏం చేయాలన్నది ఆలోచన చేయాలి. ఇలాంటి వారిపై కొరడా ఝుళిపిం చాలి. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులను చేయాలి. మళ్లీ ఎన్నుకోకుండా చూడాలి. ఇకపోతే అధికారంలో ఉండగా అప్పులు చేసి, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఇద్దరూ కలిసి అప్పుల ఊబిలోకి నెట్టారు. ఇప్పుడేమో ఉన్న ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి వీరు ఎందుకు అప్పులు చేశారు.. ఎందుకు దివాళా తీయించారన్న దానికి సమాధానం లేదు. దేశంలో బహుశా ఇంతగా అప్పుల బారినపడ్డ రాష్ట్రాలు లేవేమో. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణను పాటించలేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ అనుత్పాదక రంగాలకు విపరీతంగా దుబారా చేసారు. వీటినే అభివృద్ధి, సంక్షేమం అంటూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో ఉన్నాయి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు, రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పుల నుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభవృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించక పోవడం వంటి చర్యలతో ఇద్దరు సిఎంలు నిరంకుశంగా పనిచేయడం ద్వారా తెలుగు రాష్ట్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాంటి రాష్ట్రాలను గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఆలోచన చేయడం లేదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రజల్లో పలచన అయి, అధికారం కోల్పోయి, అసెంబ్లీకి రానని మంకు పట్టుతో ఉన్నారు. పార్టీలను అణగదొక్కడంలో కెసిఆర్ చేసిన కృషి ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాలు బెడిసి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా చేశారు. దీంతో ఆయనా అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారు. కాంగ్రెస్, బిజెపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించలేదు. వారి దెబ్బకు బిఆర్ఎస్ ఉనికిలేకుండా పోయింది. ఇలాంటి రాజకీయ నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచనచేయాలి. నిజాయితీ లేని రాజకీయ నేతలను పక్కన పెట్టడం నేర్చుకోవాలి. అసెంబ్లీకి రాని నేతలు ప్రజలకు ఏం సేవ చేస్తారో చూస్తున్నాం. అధికారంలో ఉన్నా మేలు చేయలేదు. విపక్షంలో ఉన్నా మేలు లేదని కెసిఆర్, జగన్‌లు నిరూపించారు. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను,ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె

కూడా ఇప్పుడు అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయ్యారు. ఇలాంటి దుస్తితి ఎదుర్కోవాల్సి వస్తుందిన ఊహించి ఉండక పోవచ్చు. పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేసారు. పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్న వామపక్షాలను మమతా బెనర్జీ బలహీనపరిచారు. ఎపిలో కూడా జగన్ టిడిపిని తిట్టడం,కేసులు పెట్టడం, లేపేయడం వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వండం తో ప్రజలు తిరిగి టిడిపిని ఎన్నుకున్నారు. ప్రజలు మెచ్చేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి దిగులు లేదు. అయితే ఇది విస్మరించి వ్యహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్‌లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్నారు. వారు అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో మంచిచేస్తే మంచిని చెప్పాలి. విపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలి. సమస్యలపై నిలదీయాలి. కానీ అధికార పక్షం ఎదురుదాడిని తట్టుకోలేక భయంతో అసెంబ్లీకి ముఖం చటేస్తున్నారు. ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించడంలేదు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వా మ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. అసెంబ్లీకి వెళ్లకుంటే నష్టపోయేది జగన్, కెసిఆర్‌లు మాత్రమేనని గుర్తించాలి.

# ఓట్ల దొంగకు రక్షగా ఈసీ

### కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి రాహుల్ ఆరోపణలు

- ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు
- ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు
- ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం
- కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఓట్లు తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్లప్పగించి చూస్తోం ఓదని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్షలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్‌ల నుంచి ఓట్లు- తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి మేము 100శాతం రుజువును కనుగొన్నాము. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ప్రజాస్వామ్య పక్రియను ప్రేమిస్తున్నాను. నేను ఆ పక్రియను రక్షిస్తున్నాను. మీరు నిర్ణయించగల 100 శాతం రుజువు ఆధారంగా కాకుండా నేను ఇక్కడ ఏమీ చెప్పబోవడం లేదు. తీర్పు మీదేనని రాహుల్ గాంధీ అన్నారు.ర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఎవరో 6,018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారని.. చివరికి ఎవరో పట్టుబడ్డారన్నారు. ఇది చాలా నేరాల మాదిరిగానే యాదృచ్ఛికంగా పట్టుబడినట్లు- తెలిపారు. ఈ తొలగింపు ప్రయత్నాలు కేవలం కాంగ్రెస్ పార్టీ గెలిచే బూత్‌ల్లోనే జరిగిందని వివరించారు. గోదాబాయి పేరుతో ఎవరో నకిలీ లాగిన్ సృష్టించి 12 మంది ఓటర్ల పేర్లు తొలగించారన్నారు. కానీ ఈ విషయం గోదాబాయికి తెలియదని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఫోన్ నెంబర్ల ద్వారా ఈ తతాంగం అంతా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. వారంలోపు ఈసీ డేటా విడుదల చేయాలని.. లేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నవారిని రక్షిస్తున్నారని భావించాల్సి ఉంటుందని తెలిపారు. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలంటూ చేస్తున్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబ్ కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు. ఈ విమర్శలను ఎన్నికల సంఘం, భారతీయజనతా పార్టీ ఖండించింది. బాంబ్ తుస్సు అందని భాజపా ఎద్దేవా చేసింది.

# సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం


### రాహుల్ విమర్శలను ఖండించిన ఈసీ
### అబద్ధాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం
### రాహుల్ విమర్శలపై మండిపడ్డ బిజెపి నేతలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:** ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారని ఈసీ వెల్లడించింది. ఇలా తొలగంపు అన్నది జరగదని కూడా ఇసి స్పష్టం చేసింది. ఇదిలావుంటే ఓట్ల తొలగింపు అంటూ రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారని దిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయన అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

# చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ ఉద్దేశం

- బంగ్లా చొరబాటుదారులకు అండ
- ఓట్లచోరీ ఆరోపణల వెనక ఇదే లక్ష్యం
- రాహుల్ తీరుపై మండిపడ్డ అమిత్ షా



**పాట్నా, సెప్టెంబర్ 18:** ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటుదారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటు-దారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా' అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ-శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు- సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీ-వల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



# నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

### నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్18:** నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని సుశీల కార్కీకు మోడీ సందేశం పంపారు. సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టు-డికిన నేపాల్ లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు- మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటు-ను రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు- ఆయన ప్రకటించారు.


19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 5



# ప్రజలకు ముందుగానే పండుగ బోనస్

మొదటి పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. గతంలో డబ్బులు లేనప్పుడు ట్యాక్స్ వేసేవారని.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, టెక్నాలజీ, సవరణలను అమలు చేయడానికి తాను ముందు ఉంటానని ఉద్ఘాటించారు. ఎవరైతే సంపద సృష్టించలేరో వారికి సంక్షేమం ఇచ్చే అర్హత లేదని చమత్కరించారు. జీఎస్టీ స్లాబ్‌లలో మార్పు వస్తే ఇబ్బందులు వస్తాయని.. ఆదాయం తగ్గుతుందని ఆర్థిక శాఖ అధికారులు తనకు మొదట చెప్పారని గుర్తుచేశారు. అయితే వారితో దేశమే తొలి ప్రాధానమ్యని .. దాని తర్వాతే ఆదాయమని తాను చెప్పానని అన్నారు. ముందు ఏపీ నుంచి అధికారులు వెళ్లి జీఎస్టీ 2.0 సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని ఆదేశించినట్లు- చెప్పారు. ఐదు టైర్ల స్లాబ్‌ల నుంచి 2 స్లాబ్‌లకు జీఎస్టీని మార్చడం వల్ల 140 కోట్ల మందికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈసారి అన్ని పండుగలు ఘనంగా చేసుకునే అవకాశం వస్తుందని చెప్పుకొచ్చారు. గతంలో సంక్రాంతికి కానుక ఇచ్చామని... ఈరోజు జీఎస్టీ సవరణలతో 12 శాతంలో ఉన్న వారు సున్నా శాతం జీఎస్టీ కిందకు వచ్చేస్తారని తెలిపారు. కొంతమందే



ఇలాంటి జీఎస్టీ సవరణలు చేయగలుగుతారని... అలాంటి వారిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుంటారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. 11 సంవత్సరాల్లో ప్రధాని మోదీ నిర్ణయాలు చూస్తే ట్యాక్స్ పేయర్స్ 130 శాతం మంది పెరిగారని వివరించారు. జీఎస్టీ బిల్లులు 207 శాతం పెరిగాయని... ఈరోజు రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం జీఎస్టీ ద్వారా వస్తోందని వెల్లడించారు. అన్ని రాష్ట్రప్రభుత్వాలకు జీఎస్టీ 2.0 సవరణలను వివరించిన తర్వాతనే ఆమోదించారని తెలిపారు. ఇంకా కొంచెం కష్టపడితే డబుల్ డిజిట్స్ సాధించే ఏ-కై-క దేశం భారతదేశమే అవుతుందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. జీఎస్టీ వల్ల రూ.2లక్షల కోట్లు- జనరేట్ అవుతుందని వివరించారు. ఎంత ఇన్సెంటివ్స్ ఇస్తున్నామో అంత ప్రభావం జీఎస్టీ 2.0 సవరణల ఒక్క నిర్ణయం వల్ల వస్తుందని అన్నారు. ట్యాక్స్ , ఉద్యోగాలు, ఆదాయం ఇలా ఒకదానికి ఒకటి ఆధారపడి ఉండి ఆర్థిక వ్యవస్థకు బూస్ట్‌గా తయారు అవుతాయని చెప్పుకొచ్చారు. ఈ బెనిఫిట్‌ను డబుల్ ఇంజన్ సర్కార్ ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు చెప్పాలని సూచించారు. నిత్యావసరాలు చాలా వరకూ బెనిఫిట్ లభిస్తుందని పేర్కొన్నారు. కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు 28 నుంచి 18శాతం జీఎస్టీ తగ్గుతుందని.. దీంతో మధ్యతరగతి వారు కూడా ఏసీలు వినియోగించడానికి ముందుకు వస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## పదిరోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు

**అమరావతి :** ఏపీ అసెంబ్లీ సమావేశాలు 10 రోజుల పాటు- నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. . సభలో చర్చించేందుకు 18 అంశాలను తెదేపా ప్రతిపాదించింది. గురువారం ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలు ఈనెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. 10 రోజుల పాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడి అధ్యక్షతన జరిగిన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ- భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు- మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, విష్ణుకుమార్ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై తుది నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్ లు తగ్గించడంతో ధరలు తగ్గడం, ప్రజలకు కలిగిన లాభంపై ఇవాళ్టి సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటన చేయనున్నారు. ఈ ప్రకటనపై పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడనున్నారు. కేంద్రాన్ని అభినందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం ఇవ్వనున్నారు. అలాగే, జలవనరుల శాఖపై నేడు చర్చ జరపనున్నారు. ఈ నెల 22న శాంతి భద్రతలు, 23న వైద్యారోగ్యం, 24న పరిశ్రమలు, 25న సూపర్ సిక్స్ పథకాలు, 26న క్వాంటం, 27న లాజిస్టిక్స్, 29న స్వర్ణాంధ్ర దిశగా ఏపీ, 30వ తేదీన రాయలసీమ- కోస్తా- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ నెల 20, 21, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవులు ఇచ్చారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అసెంబ్లీ సమావేశాలు జరపాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రశ్నోత్తరాలతో పాటు జీరో అవర్ లోనూ సభలో మంత్రులు ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అసెంబ్లీలో చర్చించేందుకు 9 అంశాలను బీజేపీ ప్రతిపాదించింది.

## జీఎస్టీ సంస్కరణలకు ఏపీ తొలిమద్దతు



**అమరావతి :** రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా జీఎస్టీ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే అని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిదని.. దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి పెరుగుతోందని చెప్పుకొచ్చారు.జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభలో డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ తీర్మానం చేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జీఎస్టీ మండలి 56వ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలను కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు-, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పాలు, పెరుగుపై పన్ను 5శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు. సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. జీఎస్టీ విషయంలో అన్ని వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఏపీ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు- పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏఏ బెనిఫిట్స్ జీఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు పవన్. పరస్పర అవగాహనతోపాటు- మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్ ఇస్తున్నాం

### 11,98,501 మంది పింఛన్ సౌకర్యం

### ఎవ్వరినీ కూడా జాబితా నుంచి తొలగించలేదు

### మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి శ్రీనివాస్ సమాధానం

**అమరావతి :** అర్హులయిన వారికి పింఛన్లు ఎక్కడా తొలగించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఎవరైనా చనిపోతే వెంటనే ఆ కుటుంబంలో మరొకరికి ఇస్తున్నామని చెప్పారు. అనర్హులకు మాత్రమే నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. పింఛను పథకంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు సమయంలోపలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 50-59 ఏళ్ల మధ్య ఉన్న 11,98,501 మంది పింఛను పొందుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు ఇచ్చే పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు ఒకేసారి పెంచామన్నారు. అనర్హులకు నోటీసులు ఇచ్చి 2 నెలల్లో రీ వెరిఫికేషన్ చేయాలని వైద్యశాఖకు సూచించామని తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్లు ఇస్తోందన్నారు. శాసనమండలి సమావేశాల్లో ప్రశ్నోత్తరాల్లో 50 ఏళ్లకు పింఛన్ పథకంపై చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. 50-59 వయసు మధ్య ఉన్నవారు 11,98,501 మంది పింఛన్ పొందుతున్నారని.. ప్రతి నెలా ఒకటో తేదీన పేదలకు పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్లను 3 వేల నుంచి 4 వేలకు ఒకేసారి పెంచామని... అర్హులకు ఎక్కడా పింఛన్లు తొలగించలేదని స్పష్టం చేశారు. పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే భార్యకు స్పౌజ్ పెన్షన్ అందిస్తున్నామన్నారు. పెన్షన్‌లను 200 నుంచి వెయ్యి రూపాయలు చేసినా, ఆ తర్వాత నాలుగు వేలు చేసినా, 15 వేల వరకు పెన్షన్ అందిస్తోన్న ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదే అని మంత్రి చెప్పుకొచ్చారు. పెన్షన్‌లు పెంచుకుంటూ పోతామని మాయ మాటలు చెప్పలేదన్నారు. అత్యవసర పరిస్థితిలో ఊరు దాటి వెళ్ళిన వాళ్లకు మూడు నెలలు సమయం ఇచ్చామని.. తెలిపారు. అర్హులకు ఎక్కడా పెన్షన్‌లను తొలగించలేదని, ప్రతీ అర్హుడికి ఈ ప్రభుత్వంలో పెన్షన్ అందుతుందని స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు వారికి ఫించన్ మంజూరు చేశామన్నారు. ఆదివాసి గిరిజనులకు, కల్లు గీత కార్మికులకు పెన్షన్‌లను మంజూరు చేస్తున్నామని మంత్రి కొండపల్లి చెప్పారు. పెన్షన్‌ల పంపిణీపై వైసీపీ తప్పుడు



ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు.

మూడు వేల పెన్షన్‌ను 5 వేలు పెంచారని, ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల పెంచిన పెన్షన్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో డయాలసిస్ చేయించుకుంటున్న వారికి వయస్సుతో సంబంధం లేకుండా పెన్షన్ ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదే అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు.

## శాసనమండలిలో మనకు బలం ఉంది





మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీలతో జగన్ అధ్యక్షతన లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్సీలకు జగన్ మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం అసెంబ్లీలో బీజేపీ, జనసేన, టీడీపీ అధికార పక్షంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైసీపీ మాత్రమేనని జగన్ పేర్కొన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు ప్రతిపక్ష హెూదా కూడా దక్కకుండా చేయాలని చాలామంది సలహాలిచ్చినా, కొందరు టీడీపీ సభ్యులను పార్టీలోకి లాక్కోవాలని చెప్పినా తాము అలా చేయలేదని జగన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కూడా దారుణంగా ఉందని అభిప్రాయపడ్డారు. శాసనమండలిలో వైసీపీకి బలం ఉందని... ఆ బలాన్ని ఉపయోగించుకొని ప్రజా సమస్యలపై గట్టిగా గళం విప్పాలని ఎమ్మెల్సీలకు ఆయన దిశానిర్దేశం చేశారు.


## యూరియా కొరతపై వైసీపీ వాయిదా తీర్మానం

**అమరావతి :** ఏపీ శాసనమండలి సమావేశాలు ప్రారంభమైన కొద్ది సేపటికే వైసీపీ సభ్యుల ఆందోళనతో వాయిదా పడింది. సభ మొదలవగానే యూరియా కొరత, గిట్టుబాటు- ధరలపై వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. అయితే వైసీపీ వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు సభలో నినాదాలు చేశారు. అయితే యూరియా, గిట్టు-బాటు- ధరలపై సమయం కేటాయించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. చర్చకు తము రెడీ అంటూ సమాధానం ఇచ్చారు. ఎవరి ప్రభుత్వంలో ఏం చేశారు అనేది చర్చలో తేలుద్దామంటూ మంత్రి సవాల్ విసిరారు. యూరియా, పంటలకు గిట్టు-బాటు- ధరలపై బీఏసీ సమావేశంలో సమయం కేటాయిస్తే ఎన్ని గంటలు అయినా చర్చ చేయడానికి ప్రభుత్వం సిద్ధం అని అచ్చెన్న స్పష్టం చేశారు. అయితే మంత్రి సమాధానం చెప్పినప్పటికీ వైసీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం వద్ద ఆందోళనకు దిగారు. యూరియా కొరత సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. పంటలకు గిట్టు-బాటు- ధరలు లేవంటూ సిగ్గు సిగ్గు చైర్మన్ పోడియం దగ్గర నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు వైసీపీ సభ్యులు. అయితే వైసీపీ ఎమ్మెల్సీలకు టీ-డీపీ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ స్ట్రాంరగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వసతులు కల్పించక పోవడం సిగ్గు సిగ్గు అంటూ ప్రశ్న అడుగుతూ వ్యాఖ్యానించారు ఎమ్మెల్యే. కాగా.. బీఏసీ సమావేశంలో సమయం కేటాయిస్తే చర్చించేందుకు తాము సిద్ధం అని మంత్రి చెబుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీలకు నచ్చచెప్పేందుకు చైర్మన్ ప్రయత్నించారు. అయినా వైసీపీ సభ్యులు నినాదాలు ఆపని పరిస్థితి. మరోవైపు సభలో వైసీపీ సభ్యుల నినాదాలకు పోటీగా టీడీపీ సభ్యులు కూడా నినాదాలు చేశారు. రైతు ద్రోహి జగన్ అంటూ కావలి గ్రీష్మ నినాదాలు చేశారు. ఈ క్రమంలో సభలో పరిస్థితి గందరగోళంగా మారడంతో మండలి చైర్మన్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు.

## శ్రీశైలం మల్లన్న ఆలయ చైర్మన్‌గా రమేష్ నాయుడు

**అమరావతి :** రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం మల్లన్న ఆలయ ఛైర్మన్‌గా రమేష్ నాయుడు, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా వెంకట్రాజు, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఛైర్మన్‌గా సురేంద్రబాబు, శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్‌గా కొ-÷-టటె- సాయిప్రసాద్, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా రాధాకృష్ణ నియమితులయ్యారు.

## ప్రతిపక్ష హోదా కాదు.. సభకు వచ్చి మాట్లాడు



**అమరావతి :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగడం పట్ల మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్ష హోదా అడుగుతున్న జగన్ చెంప పగలగొట్టాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 11 సీట్లు- వచ్చిన పార్టీ నేతలు ప్రతిపక్ష హోదా అడుగుతుంటే గూబ పగలగొట్టాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓడిపోయిన నాయకుడు అసెంబ్లీలోకి వచ్చి కూర్చుంటే ఎంత తప్పో ... జగన్ ప్రతిపక్ష హోదా అడగటం కూడా అంతే తప్పు అని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల అనర్హత వేటుపై అసెంబ్లీలో చర్చించి స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని.. అది స్పీకర్ పరిధిలోని అంశమని వెల్లడించారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగటం మానేసి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి అంటూ అచ్చెన్నాయుడు హితవుపలికారు. వైసీపీ నేతలపై శాసనమండలి చీఫ్ విప్ పంచమర్తి అనురాధ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన జగన్, వైసీపీ నేతలు బావిలో దూకాలంటూ మండిపడ్డారు. పోలవరం కట్టనందుకు జగన్ బావిలో దూకాలన్నారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు పిచ్చి పిచ్చి ప్రశ్నలు అడిగి సమాధానం వినకుండా సభ నుంచి పారిపోతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని సజ్జల కూటమిపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ నేతలు బయట ఉండి పిచ్చిపిచ్చి విమర్శలు చేస్తే సహించమని.. సభకు వచ్చి మాట్లాడాలని అనూరాధ హితవు పలికారు.

19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 6





# ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఏకాగ్రతతో ముందుకు సాగాలి

### విద్యార్థులకు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఉద్బోధ

### చింతకుంటలో పాఠశాలలు, అంగన్వాడి కేంద్రం తనిఖీ

**నిజామాబాద్, సెప్టెంబర్ 18( సమయం న్యూస్):** విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఏకాగ్రతతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఉద్బోధించారు. గురువారం ఆయన మోస్రా మండలం చింతకుంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి సెంటర్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి విద్యార్థిని, విద్యార్థులతో భేటీ అయ్యారు. వారిని పలు ప్రశ్నలు వేసి, బోధనా సామర్థ్యాన్ని అంచనా వేశారు. విద్యార్థుల సందేహాలను కలెక్టర్ ఎంతో ఓపికగా నివృత్తి చేస్తూ, అంకిత భావం, పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మార్గనిర్దేశం చేశారు. జిల్లా పాలనాధికారిగా తన ప్రస్థానం గురించి తెలియజేస్తూ, విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించారు. ఉన్నత స్థానాలకు చేరితే విస్తృత స్థాయిలో ప్రజలకు, సమాజానికి సేవ చేసే అవకాశం, అదృష్టం లభిస్తుందని, తద్వారా వ్యక్తిగతంగా మంచి భవిష్యత్తు, గౌరవం దక్కడంతో పాటు ఎంతగానో సంతృప్తి దక్కుతుందని సూచించారు. చదువులో ఎలా రాణించాలి, పరీక్షల్లో విజయం ఎలా సాధించాలి, లక్ష్యానికి అనుగుణంగా సిలబస్ ను ఏవిధంగా సకాలంలో పూర్తి చేసుకోవాలి, జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కార్యాచరణ ప్రణాళికను ఎలా సిద్ధం చేసుకోవాలి తదితర అంశాలను విద్యార్థులకు కలెక్టర్ సవివరంగా వివరించారు. డైట్ ప్లాన్ ను తూచ తప్పకుండా పాటించాలని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ ను ఆదేశించారు. పాఠశాల నిర్వహణను చక్కదిద్దాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యతతో కూడిన విద్యను బోధించాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కాగా, ప్రైమరీ పాఠశాలలో బాలుర కోసం వెంటనే టాయిలెట్ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# సింగరేణి గ్లోబల్ విస్తరణ ప్రాజెక్టులకు ఎస్బీఐ సహకారం

### ముంబయిలో ఎస్బీఐ ఛైర్మన్‌తో సింగరేణి సీఎండీభేటీ

### తక్కువ వడ్డీకి లోన్లు ఇవ్వాలని కోరిన ఎన్ బలరామ్



**హైదరాబాద్ సెప్టెంబర్18 (సమయం న్యూస్):** సింగరేణి అభివృద్ధి ప్రాజెక్టుల్లో పాలుపంచుకుంటామన్న ఎస్బిఐ ఛైర్మన్ శ్రీ శ్రీనివాసులు శెట్టి దశాబ్దాలుగా సింగరేణికి లీడ్ బ్యాంక్ గా వ్యవహరిస్తున్న ఎస్బిఐ సింగరేణి భవన్, సెప్టెంబరు 18, 2025 సింగరేణి గ్లోబల్ పేరుతో దేశ విదేశాల్లో చేపట్టే ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం చేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన సంసిద్ధత తెలియజేసింది. సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ గురువారం ముంబయి లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ ఎండీ శ్రీ సత్యేంద్ర కుమార్ సింగ్, సీజీఎం శ్రీ శైలేష్ ఉన్నితన్ లతో ప్రత్యేకంగా సమావేశమై ఈ అంశంపై చర్చించారు. “సింగరేణి సంస్థ త్వరలోనే దేశ విదేశాల్లో కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించబోతోంది. ఇప్పటికే సింగరేణి సంస్థకు కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ లభించింది. దేశ విదేశాల్లో కీలక ఖనిజ అన్వేషణ ఉత్పత్తి కోసం ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అధ్యయనం జరుపుతోంది. కేంద్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి సంబంధించి అందిస్తున్న రాయితీలను వినియోగించుకుంటూ దేశంలో కూడా పెద్ద ఎత్తున కీలక ఖనిజ ఉత్పత్తికి పూనుకోవాలని నిర్ణయించింది. అలాగే పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, 5 వేల మెగావాట్ల సోలార్, థర్మల్ ప్లాంట్లు, గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తోంది” అని సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ వివరించారు.

ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ త్వరలో చేపట్టనున్న భారీ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. దీనిపై ఎస్బిఐ ఛైర్మన్ శ్రీ శ్రీనివాసులు శెట్టి సానుకూలంగా స్పందించారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఇప్పటికే సింగరేణికి ప్రధాన ఆర్థిక లావాదేవీల (లీడ్) బ్యాంకుగాను సేవలు అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ సింగరేణి అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సంస్థగా తన సత్తా చాటాలని ఆకాంక్షించారు. దశాబ్దాల కాలంగా ఎస్బిఐ సంస్థ సింగరేణి తో మంచి అనుబంధం కలిగి ఉందన్నారు.

### ఎస్బీఐతో దశాబ్దాల బంధం

సింగరేణి సంస్థ దశాబ్దాల కాలంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ద్వారానే పెద్ద ఎత్తున తన ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తోంది. సింగరేణిలో ఉన్న 75% కార్మికులకు ఎస్బిఐలో నే ఖాతాలు ఉన్నాయి. అలాగే సింగరేణి ఉద్యోగుల కోసం ఎస్బిఐ సంస్థ ద్వారా కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేయడం కూడా జరిగింది. ఈ నేపథ్యంలోనే భవిష్యత్ విస్తరణ ప్రాజెక్టులలోనూ భాగస్వాములు కావాల్సిందిగా, సహకారం అందించాల్సిందిగా కోరుతూ సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఎస్బిఐ ఉన్నతాధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన ప్రధాన ఎన్నికల అధికారి

**వికారాబాద్,సెప్టెంబర్, 18 (సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లాలో గురువారము రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా కల్లెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నందున పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. ముందుగా పోలీస్ వారి చే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్,జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ లతో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ లు,ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అయన సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల వారితో మాట్లాడారు. బిఎల్ఓల పేర్లు ఇచ్చారా?, ఓటరు జాబితా పూర్తి అయినదా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్,



డిఆర్ఓ మంగీలాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మి నారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రులు లేని చిన్నారులకు వంటేరు ఆర్థిక సహాయం

**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 18:** వర్గల్ మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మంజునాథ్ ఇల్లరికం వచ్చి బార్బర్ పనులు చేసుకునేవారూ గత కొన్ని రోజులుగా మంజునాథ్ కు ఆరోగ్యానికి గురి కావడంతో చికిత్స చేయించుకుంటున్న క్రమంలో వైద్యానికి ఖర్చులవడంతో పేదరికం అడ్డు రావడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు భారతమ్మ (అమ్మమ్మ), కవిత తల్లి, ఆత్మహత్యలు చేసుకోగా ఇటీవలే మంజునాథ్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబంలోని పెద్ద దిక్కులైన ముగ్గురు రెండు నెలల వ్యావదిలోనే చనిపోవడంతో 13 సంవత్సరాలు వయసులోపు చిన్నారులు కూతురు నైనిక, కొడుకు అక్షయ్ అనాధలుగా మారారు ఈరోజు విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో చిన్నారులు నైనిక , అక్షయ్ లను పరామర్శించి 30000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు, చిన్నారులుగా నైనిక అక్షయ్ లనుధైర్యంగా ఉండాలని చెప్పి మనోధైర్యాన్ని కల్పించారు భవిష్యత్తులో చిన్నారులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు



వెంకట్ రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, కనకరాజు, మధుసూదన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, హుస్సేన్, సద్దాం, భాస్కర్, చైతన్య, నరేందర్ తదితరులు ఉన్నారు

# సరిపడా యూరియా నిల్వలు

- రైతులకు ఇబ్బంది కలగద్దు
- ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్

**బచ్చన్నపేట సెప్టెంబర్ 18( సమయం న్యూస్):** గురువారం బచ్చన్నపేట మండలం కేంద్రం లోని ప్రాథమిక సహకార సంఘాన్ని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భౌతిక నిల్వలతో పాటు స్టాక్ రిజిస్టర్, రైతు వారి సేల్ రిజిస్టర్ను ఇంచార్జ్ కలెక్టర్ పరిశీలించారు. క్రౌడ్ కాకుండా..రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా యూరియా పంపిణీ చేయాలన్నారు. ఇప్పటివరకు బచ్చన్నపేట మండలంలోని తొమ్మిది కేంద్రాల ద్వారా, సబ్ సెంటర్ల ద్వారా రైతులందరికీ యూరియా సరఫరా చేయడం జరుగుతుందని. బచ్చన్నపేట మండలంనకు ఇప్పటివరకు వివిధ డీలర్ల ద్వారా 848 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా జరిగిందన్నారు ఈ సెప్టెంబర్ మాసానికి గాను బచ్చన్నపేట మండలానికి 270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరానికి గాను



ఇప్పటివరకు 198 మెట్రిక్ టన్నుల యూరియా అయ్యిందన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీన్ , ఇందిరమ్మ ఇళ్ల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించి వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డీపీవో స్వరూప, మండల వ్యవసాయ అధికారి, ఏఈఓలు పాల్గొన్నారు


# స్వచ్ఛతయే నినాదం.. ఆరోగ్యమే ప్రధానం

### ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్

**బచ్చన్నపేట సెప్టెంబర్ 18( సమయం న్యూస్):** సెప్టెంబర్ 17నుండి అక్టోబర్ 2వ తారీఖు వరకి నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ -2025 పక్షోత్సవాలలో భాగంగా బచ్చన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ బచ్చన్నపేట ప్రధాన కూడలిలో విద్యార్థులు, మహిళా సంఘ సభ్యుల, గ్రామ ప్రజలచేత మానవహారం, ర్యాలీ, స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించి తదనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్లో సుమారు 600 మంది తో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతయే మన నినాదం - ఆరోగ్యమే అన్నింటికన్నా ప్రధానం అని అన్నారు. అందుకు ప్రతీ ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో స్వచ్ఛత పై నిర్వహించిన రంగోళి, చిత్రలేఖనం పోటీల ని తిలకించి విజేతలకి బహుమతులని ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో డీపీవో స్వరూప, డి సి -ఎస్‌బీఎం కర్ణాకర్, ఎంపీడీఓ, ఎంపీవో మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్ చెరువులో రక్తదాన శిబిరం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 18,(సమయం న్యూస్) :** పటాన్ చెరువు: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి జన్మదినం సందర్భంగా పటాన్ చెరువు అసెంబ్లీ పరిధిలోని పటేల్ గూడ, నందిగామ, తెల్లపూర్ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొని, రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేయడం అత్యంత మేలని ఆమె అన్నారు.మోడీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ద్వారా ప్రజలకు సహాయం చేయడం బీజేపీ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంషాబాద్ రాజు, వివిధ మండలాల అధ్యక్షులు ఈర్ల రాజు, వీరేశం, రాంబాబు గౌడ్, సీనియర్ నాయకులు ప్రవీణ్, శ్రీకాంత్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులతో పాటు పలువురు కార్యకర్తలు కూడా రక్తదానంలో పాల్గొని మానవత్వాన్ని చాటుకున్నారు.



19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 7



# బొంతపల్లి పారిశ్రామిక వాడలో రసాయన జలాల కలకలం

- దోమడుగు రైతుల్లో ఆందోళన





**పటాన్ చెరు,గుమ్మడిదల, సెప్టెంబర్ 18,(సమయం న్యూస్)** :సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థ జలాలు వాననీటి జరాలతో కలసి బయటకు వచ్చాయి. ఈ కలుషిత జలాలు దోమడుగు గ్రామ పరిసరాల్లోని నల్లకుంట చెరువులకు చేరడంతో మె-ంత్తం నీరు ఎరుపు రంగులోకి మారిపోయింది. చెరువుల నుంచి సమీపంలో ఉన్న పొలాల్లోకి చేరిన ఈ నీరు వరి పొలాలను పూర్తిగా కప్పేసింది.అకస్మాత్తుగా ఎరుపు నీటితో పొలాలు నిండిపోవడంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రసాయనాల మిశ్రమం పంటలకు నష్టం కలిగిస్తుందనే భయంతో రైతులు పంట భవిష్యత్తు ఏమవుతుందోనని అనిశ్చితిలో ఉన్నారు. "మా కష్టానికి పండిన పంట మొత్తం నాశనం కావడమేనా?" అని రైతులు వేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై పర్యావరణ పరిరక్షణ కమిటీ (పిసిబి),రాజకీయ నాయకులు స్పందించాలని రైతుల కోరుకుంటున్నారు. పరిశ్రమలు ఎటువంటి శుద్ధి లేకుండా యదేచ్ఛగా వ్యర్థ జలాలను విడుదల చేయడం అన్యాయం అని మండిపడ్డారు. రైతులకు నష్టం కలిగిస్తున్న రసాయన కంపెనీలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక ప్రజలు కూడా ఈ పరిస్థితిని ఆందోళనతో వీక్షిస్తున్నారు. పంటలతో పాటు చెరువులలోని నీరు కూడా ఉపయోగానికి పనికిరాని స్థితిలోకి వెళ్లిపోతుందనే భయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

# ఆర్అండ్‌బీ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి మంత్రి వెంకట్‌రెడ్డి అభినందనలు

## ప్రజల్లో శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా చూడాలని సూచన

**హైదరాబాద్: సెప్టెంబర్18( సమయం న్యూస్):** ఇటీవల ఎన్నికైన ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు. మంత్రుల నివాస సముదాయంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా నూతన కార్యర్వగ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ.. పూర్తి పారదర్శకతో ఏ శాఖలో లేని విధంగా రోడ్లు భవనాలు శాఖలో ప్రమోషన్స్ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి ఆర్ అండ్ బి శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్ అప్రూవల్ చేసుకొని రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చేలా కృషి చేశానన్నారు. తనను కలిసి వినతులు ఇచ్చినప్పుడు మీకు తప్పకుండా శాఖ పరమైన ప్రమోషన్స్ వచ్చేలా చేస్తానని చెప్పానని, ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి 118 మంది %ాజుజు% లు డి.ఈ లుగా ప్రమోషన్స్ పొందారని,అట్లాగే 72మంది డి.ఈ లు ఈ.ఈ లుగా, 29మంది ఈ.ఈ లు ఎస్. ఈ లు,ఎస్.ఈ లు సి.ఈ లుగా 6గురు,సి.ఈ నుండి ఈఎన్సి గా ఇద్దరు ప్రమోషన్స్ పొందారని గుర్తు చేశారు. శాఖలో సమూల మార్పులు తీసుకువచ్చి మీరు అడిగినవన్ని చేస్తున్నది,మరింత ఉత్సాహంతో పని చేస్తారనే నమ్మకంతోనే అని మంత్రి స్పష్టం చేశారు. మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ శాఖ బలోపేతం పై దృష్టి పెట్టి అదే స్థాయిలో పని చేసేందుకు కృషి చేయాలని,శాఖ పరమైన ఆమోదయోగ్యమైన సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇతర కేడర్లలో మిగిలిన పదోన్నతులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖ కు మంచి పేరు తీసుకువచ్చే బాధ్యత శాఖ ఇంజనీర్ల పైనే ఉందని..ఆ గురుతర బాధ్యతను గుర్తెరిగి ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలని మంత్రి వారికి హితబోధ చేశారు. "మీరు ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన తర్వాతనే మా సమస్యలు పరిష్కారమై,రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చాయని" మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి అసోసియేషన్ తరుపున తమ అభిమానాన్ని,కృతజ్ఞతను వ్యక్తం చేశారు. మంత్రిని కలసిన వారిలో ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్.శ్రీను,జనరల్ సెక్రటరీ బి.రాంబాబు,ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. శరత్ చంద్ర, ట్రెజరర్ మహేందర్ కుమార్,వైస్ ప్రెసిడెంట్లు కె.సంధ్య,వేణు,ప్రదీప్ రెడ్డి,జాయింట్ సెక్రెటరీలు నవీన్,కిషన్, అరుణ్ రెడ్డి పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు.

# స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మెడికల్ క్యాంప్‌లకు విశేష స్పందన

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**పాపన్న పేట్ సెప్టెంబర్18( సమయం న్యూస్):** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పాపన్నపేట మండల కేంద్రంలోని పిహెచ్సి లో నిర్వహిస్తున్న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి,వైద్య సౌకర్యాలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన కుటుంబమే దేశ సంక్షేమం అని అన్నారు.మహిళలు తమ కుటుంబం బాగుండాలని నిరంతరం సేవలందిస్తూ తన ఆరోగ్యం పై అశ్రద్ధ చూపుతున్నదని, అటువంటి మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని దేశవ్యాప్తంగా మహిళలకు పెద్దపీట వేస్తూ స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కు రూపకల్పన చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని, కుటుంబం సంతోషంగా ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.మహిళలు తన కుటుంబమే పరమావధిగా పెట్టుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోకపోవడం తో జన్మించే శిశువులు ఆరోగ్యవంతులుగా ఉండకపోవడం జరుగుతున్నదని, శిశువులను సంపూర్ణ ఆరోగ్యం గా తీర్చిదిద్దేందుకు మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే దృఢంగా ఉంటారని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని చూడగలుగుతామన్నారు. అందుకోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమం పై ప్రత్యేక దృష్టి పెట్టి యాక్షన్ ప్లాన్ రూపొందించి ఆరోగ్యంవంతమైన సమాజం కొరకు శ్రద్ధ తీసుకోవడం జరుగుతున్నది అన్నారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు 15 రోజులు పాటు ప్రతి వైద్య కేంద్రంలోనూ నిరంతరం సేవలందించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య సేవలను ప్రతి మహిళ తప్పనిసరిగా వినియోగించుకొని సమాజానికి సంపూర్ణ ఆరోగ్యవంతమైన శిశువును అందించాలని కోరారు. మహిళా శిశు ఆరోగ్యం కొరకు 14 రకాల సేవలు ఈ మెగా శిబిరం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలు ఆరోగ్యవంతమైన శిశువును అందించేందుకు తీసుకోవలసిన పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు

## ఇల్లందు డిఎస్పీ చంద్రభాను

**ఇల్లందు సెప్టెంబర్ 18( సమయం న్యూస్):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రభాను ఆధ్వర్యంలో ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని వినోభా నగర్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 250 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 70 ద్విచక్ర వాహనాలను,03 ఆటోలను,ఒక కారును సీజ్ చేయడం జరిగింది.అనంతరం వినోభా నగర్ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇల్లందు డిఎస్పి చంద్రభాను పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక మరియు సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.మట్కా,జూదం,బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు.విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని తెలిపారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి : నిర్మల్ కలెక్టర్

**నిర్మల్ సెప్టెంబర్18( సమయం న్యూస్):** పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా అవసరమైనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పత్తి మార్కెటింగ్ సీజన్ 2025-26లో జిల్లా సగటు దిగుబడి అంచనాకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా ఉత్పత్తి వివరాలు సేకరించి వాస్తవికంగా సగటు దిగుబడిని లెక్కించనుందని తెలిపారు. రాష్ట్ర సగటు కంటే 10శాతం మించితే ప్రత్యేక ధ్రువీకరణతో మాత్రమే ఆమోదం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు సహకరించి కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సిపిఓ జీవరత్నం, ఎడి మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డిఎస్ఓ రాజేందర్, డిఎం సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి గడ్డం వివేక్ శంకుస్థాపన



**శేరిలింగంపల్లి సెప్టెంబర్18 సమయం న్యూస్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధికారికంగా కార్మిక శాఖ. మైన్స్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరిపేటి జైపాల్, ఎమ్మెల్సీ మహమ్మద్ అజరుద్దీన్. ఆర్ అండ్ బి చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సివన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు



19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 8





# గ్రేటర్‌లో పౌర సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి: విజయలక్ష్మి

**బంజారాహిల్స్ డివిజన్ లో రూ.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ( సమయం న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పౌర సదుపాయాల పెంపుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్ లో ఎన్ బీ టీ నగర్, ఎమ్మెల్యే కాలనీ, ఎన్ బీ నగర్, మహేశ్వర్ కాంప్లెక్స్ లో రూ. 2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం శంకుస్థాపన చేశారు. రూ. 13 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులు, రూ. 10 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న మురుగునీటి లైన్ పునర్నిర్మాణం , రూ. 25 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న జీహెచ్ఎంసీ పార్క్‌లో యోగా సెంటర్ షెడ్ నిర్మాణం, రూ. 29 లక్షలతో ఎన్ బి నగర్ రోడ్ నంబర్ 12 వద్ద చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులు, రూ. 42 లక్షలతో మహేశ్వరి టవర్స్, రోడ్ నంబర్ 1&12 వద్ద చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులు వీటిలో ఉన్నాయి. మేయర్ మాట్లాడుతూ.. పౌర సదుపాయాలను మరింత అభివృద్ధి చేస్తూనే నగరంలో త్రాగునీటి సరఫరాలో క్షేత్ర స్థాయి అడ్డంకులు, సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. యోగ పార్క్ కమ్యూనిటీ ప్రజల ఆరోగ్యాని పెంపొందించుకు ఉపకరిస్తుందని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు

# ప్రజ్ఞాపూర్ పెద్ద చెరువుకు కాలువను ఏర్పాటు చేయాలి

**సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య**



**సమయం న్యూస్ సెప్టెంబర్ 18:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ పెద్ద చెరువు మత్తడికి అనుకూలంగా మత్తడి నుండి బ్రిడ్జి వరకు ప్రత్యేక కాలువ నిర్మాణం ఏర్పాటు చేసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రోడ్డును రవాణా సదుపాయానికి అనుకూలంగా చేయాలని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నెల రోజుల కాలంలో సుమారు నాలుగైదు సార్లు పెద్ద చెరువు నిండి మత్తడి రావడంతో ప్రజ్ఞాపూర్ కాలనీలతోపాటు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రహదారి మీద నుండి నీరు వెళ్లడం వల్ల కాలనీ వాళ్లతో పాటు, వివిధ అవసరాల రీత్యా రోడ్డుపైన వెళ్తున్న వారికి తీవ్రమైన సౌకర్యం ఏర్పడుతుంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. మున్సిపల్ మరియు ఇరిగేషన్ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కాలువను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగారెడ్డి బండ్ల స్వామి పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్స్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ



**పటాన్ చెరు,జిన్నారం, సెప్టెంబర్ 18,(సమయం న్యూస్) :** సంగారెడ్డి జిల్లా జిన్నారం సీఐ నయిముద్దీన్, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి బుధవారం ఫోటోగ్రాఫర్స్ సంఘ సభ్యులతో కలిసి ఫోటోగ్రాఫర్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 19, 20, 21 తేదీలలో హైదరాబాద్‌లో జరగబోయే ఈ ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫర్లు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు సంఘటితంగా ఉండాలని, తమ కళను సమాజానికి అందించడంలో ఎల్లప్పుడూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఫోటోగ్రాఫర్స్ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు ముత్తు, కోశాధికారి నవీన్, సభ్యులు ప్రవీణ్, ప్రభాకర్, బాలా గౌడ్, సంపత్, శేఖర్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం

**తాండూరు,సెప్టెంబర్ 18(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా తాండూరు: తాండూరు డిపో పరిధికి సంబంధించి నేడు శుక్రవారం తేదీ. 19-09-2025 సాయంత్రం 04 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ సురేష్ కుమార్ తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై సెల్ నెంబరు 9959226251 ఫోన్ చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# ప్రతి సోమవారం బ్యాంకు ఖాతాలో నిధులు జమ

**● మంత్రి పొంగులేటి**



**ఖమ్మం , సెప్టెంబర్ 18 : ( సమయం న్యూస్):** అర్హులైన నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని , ప్రతి సోమవారం వారందరికీ బ్యాంకు ఖాతాలలో నిధుల జమ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మేకలతండ గ్రామంలో 10 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, మేడిదపల్లి గ్రామంలో 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, 12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు, తిమ్మక్కపేట గ్రామంలో 10 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు మంత్రివర్యులు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఖమ్మం-వరంగల్ ఆర్ అండ్ బి రోడ్డు నుండి కుక్కల తండా వయా భూక్యా తండ వరకు 3 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, ఇదే గ్రామంలో గతంలో 25 లక్షల రూపాయలతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, ప్రస్తుతం మరో 10 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, గ్రామపంచాయతీ భవనానికి 20 లక్షల రూపాయలు, మంచినీటి పథకానికి 5.5 లక్షల రూపాయలు మంజూరు చేసామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పేద ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, గురుకులాల్లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జిలు పెంచామని అన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను మోసం చేస్తే, మన ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో మొదటి విడతలో 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన అర్హులకు కూడా తదుపరి విడుతలలో తప్పనిసరిగా ఇండ్లు మంజూరు చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు మరో 3 సార్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. కూసుమంచి మండలంలో కూడా పర్యటించి , పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూసుమంచి గ్రామంలో 35 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణాలకు, చేగొమ్మ గ్రామంలో 49 లక్షల 50 వేలతో నిర్మించనున్న అంతర్గత సీసీ నిర్మాణాలకు, కేశవాపురం గ్రామపంచాయతీ చింతల తండా గ్రామంలో 20 లక్షల 50 వేలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ చేగొమ్మ గ్రామంలో 20 లక్షల రూపాయలతో ఆరోగ్య కేంద్రం, 20 లక్షల రూపాయలతో పంచాయతీ భవనం, మంచి నీటి పథకానికి 4.5 లక్షలు ఖర్చు చేసి పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ప్రజలు అందిస్తున్న సహకారంతో ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల తీసుకుని వచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల రైతుల రుణమాఫీ పూర్తి చేసామని అన్నారు. తొలుత కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 18 కళ్యాణలక్ష్మి, ఇద్దరు షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ , ఆర్ అండ్ ఎస్ఇ యాకోబు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, తిరుమలాయపాలెం తాసిల్దార్ విల్సన్ , ఎండిఓ సిలార్ సాహెబ్ , కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు తగ్గించటం అమానుషం

**ఖమ్మం , సెప్టెంబర్ 18 : ( సమయం న్యూస్ ):** మైనారిటీ సంక్షేమ గురుకులాల్లో ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతాలను 30 నుండి 40 శాతం తగ్గిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం చాలా బాధాకరమని ఉపాధ్యాయ సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా రెగ్యులర్ ఉపాధ్యాయులు తో సమానంగా కష్టపడి , పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న వారి జీతాలు తగ్గిస్తూ హఠాత్తుగా జీవో జారీ చేయడం అమానుషమన్నారు. రెండు నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాల్ని ఎటువంటి సమాచారం లేకుండా తగ్గించి , జమ చేయడం విస్మయానికి గురిచేసిందని వాపోయారు. ప్రస్తుత పరిస్థితులలో జీతాలు పెంచాలి తప్ప ఉన్న జీతాల్ని ఒకేసారి కోత పెట్టడం అన్యాయం అని , వెంటనే దాన్ని సరిదిద్ది , పాత జీతాన్ని పునరుద్ధరింప చేస్తూ జీవో జారీ చేయాలని అధికారులను కోరారు. గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ను ఖమ్మం లోని వారి కార్యాలయంలో కలిసి , సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లగా వారు ఆ సమస్యను పరిశీలించి ,తగిన



న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రెటరీ మొహమ్మద్ ముజీబ్ , మైనారిటీ ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తున్న స్వీప్ కార్యకలాపాలు

**ఓటరుగా నమోదు, ఓటింగ్ శాతం పెంచేలా జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం**


**హైదరాబాద్, సెప్టెంబర్ 18, ( సమయం న్యూస్):** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదేనని జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ అన్నారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల త్వరలో జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మార్గదర్శనంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్వీప్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. యువతను ఓటరుగా నమోదు చేయించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేశారు. ఈ క్రమంలో గురువారం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో డా. వివేకానంద్ మాట్లాడారు. ఎన్నికలలో ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలో జులై 1, 2025 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొంటే రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛత, పారదర్శకత పెరుగుతుందనీ జిహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సి.ఓ వెంకటయ్య, శోభారాణి, రిసోర్స్ పర్సన్ లు రామలక్ష్మి , మహమ్మద్ గౌస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వివిధ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కోస్గి, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పర్యటన సందర్భంగా నారాయణపేట జిల్లా కోస్గి మండలం లోని తోగపూర్,పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకులను, పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ఇటీవలే మృతిచెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి,అనంతరం ఆయన మృతికిగల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# మధుయాష్కికి పట్నం పరామర్శ



**హైదరాబాద్ సెప్టెంబర్ 18( సమయం న్యూస్)ట:** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ, ఎల్బీనగర్ ఇన్చార్జి మధు యాష్కి గౌడ్ ను పరామర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి గారు. నిన్న సచివాలయంలో అస్వస్థతకు గురైన నేపథ్యంలో మహేందర్ రెడ్డి ఈ రోజు మధుయాష్కి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి వాకాబు చేశారు. అసలు ఏమైందని అడిగి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నిరంతరం ప్రజల కోసం తపించే మీరు కాస్త ఆరోగ్యం జాగ్రత్త అన్నా అంటూ మహేందర్ రెడ్డి సూచించారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కొడంగల్, సెప్టెంబర్18 (సమయం న్యూస్):** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 90% అయిపోయి ప్రారంభ దశలో ఉంటే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తాదో అని దాని డిజైన్ మార్చి కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని తెర పైకి తెచ్చిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కొడంగల్ లో పార్టీ మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలోని రైతులు తిండి తిప్పలు లేకుండా యూరియా కోసం లైన్లో రాత్రి అనక, పగలనక నిలబడితే అడిగే దిక్కు లేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ లను వెంటనే అమలు చేయాలన్నారు. అదే విధంగా కొడంగల్ పట్టణంలో రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయిన చిరువ్యా పరులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిలోఫర్ ఆసుపత్రిలో వసతుల కల్పనకు కృషి

## మంత్రి దామోదర రాజన్నర్సింహ



**హైదరాబాద్, సెప్టెంబర్ 18( సమయం న్యూస్):** నిలోఫర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన కు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు మంత్రి ఆదేశం. నిలోఫర్ ఆసుపత్రి లో అన్ని విభాగాలను పటిష్ఠపర్చాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం. నిలోఫర్ లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశం . పీజీ విద్యార్థులకు ఆసుపత్రి లో హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశం. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగుల సహాయకులకు వసతి కల్పన పై సుదీర్ఘంగా మంత్రి చర్చ. రోగుల సహాయకులకు వసతి సౌకర్యం ఆసుపత్రిలో కల్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం. క్యాడర్ స్ట్రెంత్ కు అనుగుణంగా సిబ్బంది నియామకంపై దృష్టిసారించాలని మంత్రి ఆదేశం. ఉస్మానియా మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రులలలో రెండవ అత్యధిక ఓపీ, ఐపీ వైద్య సేవలు అందిస్తున్న నిలోఫర్ ఆసుపత్రి బలోపేతం పై ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కార్యాలయం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి లోని భవనాల పరిస్థితి పై టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి చర్చించారు. నిలోఫర్ ఆసుపత్రి లో మౌలిక సదుపాయాల కల్పన , హెచ్ఆర్, ఎక్విప్ మెంట్లు రిపేర్లు , ఆర్వో వాటర్ ప్లాంట్ , శానిటేషన్ , డ్రైనేజీ సిస్టం , ఇన్ఫ్రా , రోగులకు , వారి సహాయకులకు అవసరమైన సౌకర్యాల కల్పన కు పెద్దపీట వేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష లో హెల్త్ సెక్రటరీ డా . క్రిస్టినా , టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణిందర్ రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ , అదనపు డీఎంఈ డాక్టర్ వాణి, నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## హిమాయత్‌నగర్ టీడీడీ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా

# నేమూరి శంకర్ గౌడ్



**హైదరాబాద్ , సెప్టెంబర్ 18:** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్ ఛార్జ్ గా పని చేస్తున్న నేమూరి శంకర్ గౌడ్ కు టీటీడీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన వివిధ దేవాలయాల అడ్వైజరీ కమిటీ చైర్మన్ లలో శంకర్ గౌడ్ కు స్థానం లభించింది. హిమాయత్ నగర్ లోని టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గా శంకర్ గౌడ్ ను నియమించారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు శంకర్ గౌడ్ సన్నిహితంగా ఉంటారు. జనసేన పార్టీ పుట్టకముందు 2008 నుంచి పవన్ కళ్యాణ్ తో శంకర్ గౌడ్ ప్రయాణం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ నమ్మిన బంటుగా శంకర్ గౌడ్ కు పేరుంది. ఈ నేపథ్యంలోనే శంకర్ గౌడ్ ను జనసేన పార్టీకి తెలంగాణ ఇన్ ఛార్జ్ గా పవన్ కళ్యాణ్ నియమించారు. తెలంగాణాలో కూడా జనసేన పార్టీని బలోపేతం చెయ్యడంలో శంకర్ గౌడ్ తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఈ తరుణంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన వివిధ దేవాలయాల అడ్వైజరీ కమిటీల్లో హిమాయత్ నగర్ లోని టీటీడీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గా శంకర్ గౌడ్ స్థానం కల్పించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన టీటీడీ ఆలయానికి సంబంధించిన అడ్వైజరీ కమిటీ చైర్మన్ గా తనను నియమించడం పట్ల శంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు , ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసంతో హిమాయత్ నగర్ టీటీడీ ఆలయ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించిన పవన్ కళ్యాణ్ విశ్వాసాన్ని నిలబెడతానని శంకర్ గౌడ్ తెలిపారు.

# గ్రామీణ క్రీడాప్రతిభను గుర్తిస్తాం.. ప్రోత్సహిస్తాం

## సీఎం కప్ 2025 నిర్వహణలో అందరినీ భాగస్వామ్యం చేస్తాం

## పండుగ వాతావరణంలా క్రీడాజ్యోతి ర్యాలీలు

## క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

## జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం




**హైదరాబాద్ సెప్టెంబర్ 18(సమయం న్యూస్):** గ్రామీణ క్రీడాకారుల ఉత్సాహానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా సీఎం కప్ 2025 నిర్వహిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో ఆయన జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులు, మరియు క్రీడా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కప్ 2024మాదిరిగానే సీఎం కప్ 2025 కూడా గ్రామీణ స్థాయి నుంచి నిర్వహిస్తామని, గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం అందులో భాగస్వామ్యం చేస్తామని ఆయన తెలిపారు. సీఎం కప్ 2025 నిర్వహణ మొక్కుబడిగా నామమాత్రంగా నిర్వహించకుండా, అందరు ప్రజాప్రతినిధులను మరియు అధికారులను ఇందులో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఇందులో ఎటువంటి పార్టీ భేదాలు లేకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా స్వయంగా మాట్లాడడం లేఖలు రాసి వారి సహాయాన్ని కోరుతామని, జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన తెలిపారు. జిల్లాలో పరిపాలనపరంగా క్రీడా శాఖలో కొన్ని ఇబ్బందులు ఉన్నా సీఎం కప్ నిర్వహణకు చిత్తశుద్ధితో ఉత్సాహంతో కృషి చేస్తున్న అధికారులను ఆయన అభినందించారు. పోటీలను కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం చేయకుండా ప్రతి ఉమ్మడి జిల్లాల్లో ఆయా జిల్లాల్లో ప్రాచుర్యం ఉన్న క్రీడాంశాలలో పోటీలు అన్ని జిల్లాల లో ఒక పండుగ వాతావరణం తెచ్చేలా నిర్వహిస్తామని తెలిపారు. కేవలం పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడాకారుడి సమాచారాన్ని నిక్షిప్తం చేసి ప్రతిభా కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎం కప్ విజయవంతానికి పిఈటిలు ఫిజికల్ డైరెక్టర్ల సహకారం తీసుకోవాలని అన్ని క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. సంకల్పబలం గట్టిదైతే ఏ పనైనా సాధించవచ్చని, సీఎం రేవంత్ రెడ్డి గారు క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహానికి క్రీడా శాఖ అధికారులు చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో కృషి చేస్తే అంచలంచలుగా క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సీఎం కప్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు భవిష్యత్తు క్రీడా అవకాశాల్లో మంచి స్థానం ఇస్తామని, సీఎం కప్ సర్టిఫికెట్లకు ప్రభుత్వం కల్పించే విద్య ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత దక్కేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వహణ వాటి ఆశయాన్ని లక్ష్యాలను గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం చేసేందుకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో క్రీడాజ్యోతి కార్యక్రమాలు నిర్వహించి అందులో క్రీడాకారులు క్రీడాభిమానులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని డి వై ఎస్ ఓ లను కోరారు. సీఎం కప్పోటీల తేదీలు మరియు క్రీడాజ్యోతి ర్యాలీ తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు జరిగే ఈ పోటీలలో అన్ని స్థాయిల్లో విజయవంతం చేసిన ఐదు జిల్లాలను ఎంపిక చేసి వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారి పట్ల కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వాహణలో క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు కోచులు పాల్గొన్నారు.



# పిల్లల భద్రతకు క్లాప్ ఫర్ చిల్డ్రన్

**హైదరాబాద్, 18 సెప్టెంబర్ (సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం, యూనిసెఫ్, హైదరాబాద్ జిల్లా పరిపాలన సంయుక్త భాగస్వామ్యంతో "క్లాఫ్‌ఫర్‌చిల్డ్రన్" పిల్లల భద్రత కోసం నగర స్థాయి కార్యాచరణ ప్రణాళిక"ను గురువారం ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజాలు కలిసి, హైదరాబాద్‌లో ప్రతి బాలుడు సురక్షితంగా, ఆరోగ్యంగా, సపోర్ట్ తో ఎదగడం కోసం కృషి చేయనున్నారు. ఇందులో ప్రధానమైన అంశాలు ఏంటంటే... సమయానుకూల రక్షణ కోసం చట్టపరమైన సంస్థలు మరియు ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేయడం. మహిళా, శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, సామాజిక సంక్షేమ, జీహెచ్ఎంసీ, పంచాయతీ రాజ్, విపత్తు నిర్వహణ విభాగాల సమన్వయ చర్యలు. పిల్లలు, సమాజం చురుకైన భాగస్వామ్యంతో బుల్లీయింగ్, ఈవ్-టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నివారించడం. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీలు ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ మరియు బాధ్యత వహించడం. ఫ్రంట్‌లైన్ వర్కర్లకు పిల్లలకు అనుకూలమైన, ట్రామా-ఇన్‌ఫార్మ్ పద్ధతులపై సామర్థ్యవృద్ధి మరియు నియమిత శిక్షణ ఇవ్వడం. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, సీతక్క మంత్రులు మాట్లాడుతూ హైదరాబాద్‌ను తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆదర్శ "పిల్లల భద్రతా నగరం"గా మార్చడం కోసం సమిష్టి కట్టుబాటును పునరుద్ఘాటించారు. ఇతర నగరాలు, రాష్ట్రాలకు కూడా ఇది ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, హైదరాబాద్‌కలెక్టర్ హరిచందనా దాసరి తదితరులు పాల్గొన్నారు.



# చేతగాని కోతల ప్రభుత్వం

## విద్యుత్ సంస్థలు అవినీతిపై స్పందించరా

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

రాయపోల్ : ఎన్నికల్లో ఉచిత హామీలు ఇచ్చి గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో కోతల ప్రభుత్వం గా మారిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. దౌల్తాబాద్ మండలం లోని తిర్మలాపూర్ లో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు ఎన్నో ఆశలతో ఓట్లు వేసిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చుక్కలు చూపెడుతున్నారని విమర్శించారు. జనుము, జీలుగు విత్తనాల నుండి మొదలు కొంటె దుక్కి మందు,విత్తనాలు కొరత, యూరియా కొరత, కరెంటు కోతలు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ కోతలే పెట్టి రైతులను అరిగో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి పంటలు సాగు చేస్తే సకాలంలో యూరియా లేక చేను ఎదుగుదల ఆగిపోయిందని,పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బోనస్ ఇస్తారని సన్న వరి రకం పెద్ద ఎత్తున సాగుచేశారని, కొనుగోళ్లు చేయకపోతే, సబ్సిడీ ఇవ్వకపోతే రైతులు తిరుగుబాటు చేయడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పరంగా ఘోరంగా విఫలమైందని మంత్రులు ఎమ్మెల్యేలు చేతులెత్తేసారని తెలిపారు. విద్యుత్ సంస్థలో అవినీతి తిమింగలం బయటకు వచ్చిందని కోట్లాది రూపాయలు కూడ బెట్టారని, బాత్రూంలో ఎక్కడ చూసినా డబ్బులే దొరుకుతున్నాయని ఇంత పెద్ద వ్యవహారం పై ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించక పోవడం తో అవినీతిలో మంత్రులకు ఏమైనా సంబంధం ఉందా అని ప్రజల అనుమానిస్తున్నారని పేర్కొన్నారు. చిన్న స్థాయిలో ఉన్న అధికారి దగ్గరే ఇంత అవినీతి జరిగితే పెద్ద స్థాయిలో ఎంత ఉంటుందో ఉహించుకోవచ్చన్నారు. లోతైన విచారణ చేసి అవినీతి వ్యవహారం పై చర్యలు తీసుకోవాలన్నారు.

# మెగా హెల్త్ వైద్య శిబిరం



**రాయపోల్, సెప్టెంబర్ 18:** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా రాయపోల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ మహారాజ్ ఆధ్వర్యంలో గురువారం మెగా హెల్త్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రాయపోల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి 224 మంది ప్రజలు వైద్య శిబిరం లో పాల్గొన్నారు. వివిధ స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి, వారికి అవసరమైన వైద్య సలహాలు,మందులు అందించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఆనంద్ (ప్రోగ్రామ్ ఆఫీసర్),డాక్టర్ శ్రీనివాస్ (గజ్వేల్ డివిజన్) పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,వినోద్, మంజు, నీరజ (స్టాఫ్ నర్సులు), మోహన్‌రావు (ఫార్మాసిస్ట్), ప్రవీణ్, డాక్టర్ సారా ఫిరదోస్ లింగం (యునాని ఫార్మాసిస్ట్), మంజుల, భాగ్య, ప్రేమ, మాధవి పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువులో రాణించాలి




**రాయపోల్,సెప్టెంబర్18:** విద్యార్థులు చదువులో రాణించి,ప్రత్యేక విజన్ తో ముందుకు వెళ్లాలని తొగుట సీఐ లతీఫ్,మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డి లు అన్నారు. రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాల లో గురువారం విద్యార్థులకు గంగి యాదగిరి సహకారం తో టై,బెల్టు, షు,యూనిఫామ్ లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, కృషితో చదువుల్లో రాణించాలని సూచించారు. విద్యనే వ్యక్తిత్వ వికాసానికి పునాది అని, కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించి, ఇంటి వద్ద సరైన వాతావరణం కల్పించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని, అన్ని రంగాల్లో సమానంగా అభివృద్ధి సాధించాలని తెలిపారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, తిమ్మక్కపల్లి హెచ్ఎం నవీన్, చిన్న మాసన్ పల్లి హెచ్ఎం శ్రీకాంత్,ఎస్ఐ మానస, వెంకటయ్య,బిక్షపతి,విద్యార్థులు వారి తలిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు

- జిల్లా కలెక్టర్. పి. ప్రావీణ్య
- కొండాపూర్ లో ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించిన కలెక్టర్.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా పాఠశాలల తనిఖీ



**కొండ పూర్ సెప్టెంబర్ 18( సమయం న్యూస్):** విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వ చర్యలు , ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని , రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బంది సమయపాలన పాటించాలనిజిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొండాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ... ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షిస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని పి హెచ్ సి ఆరోగ్య కేద్రాన్ని ,ఇందిరమ్మ గృహ నిర్మాణాలను ఆకస్మికంగా సందర్శించారు . ఈ సందర్భముగా పి హెచ్ సీ ను కలెక్టర్ తనిఖీ చేసి, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ వార్డ్ ను పరిశీలించారు. ఆస్పత్రి కి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బంది సమయ-పాలన పాటించాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున సిజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాలలో జ్వర సర్వే లాంటి కార్యక్రమాలు నిర్వహించడం రీజనల్ వ్యాధులు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కలిగించడం, మురుగునీరు గ్రామాల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కలెక్టర్ ఆదేశించారు.ఆస్పత్రికి అవసరమైన రిక్వైర్మెంట్ లు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. పి హెచ్ సి కాంపౌండ్ వాల్ కు సంబంధించిన వివరాలు అడిగితెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు బిల్లుల చెల్లింపు లో జప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తూ నిర్మాణపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు . గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేయడం జరిగింది , అందులో ఎన్ని నిర్మాణాలలో ఉన్నాయో, ఎన్ని స్లాబ్ లెవల్ లో ఉన్నాయి , ఎన్ని బేస్మెంట్ లెవల్ ఉన్నాయ అని ఎంపీడీఓ ని అడిగి తెలుసుకున్నారు.బేస్మెంట్ లెవల్, లెంటల్ లెవల్ వరకు పూర్తి అయిన వారికి లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అయ్యాయా అని తెలుసుకున్నారు.ఇంకా ఫోటో కాప్చర్ చేయనవి ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే చేయాలని హౌసింగ్ ఏఈ లను ఆదేశించారు. గ్రామంలో ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి , అవి ఏ ఏ దశల్లో వున్నాయి అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి, వేణు గోపాల్, తహసిల్దార్ అశోక్,, ఆత్మ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## బోధన్ సబ్ రిజిస్టర్ ఆఫీసుకు భవన యజమాని తాళం

**బోధన్ సెప్టెంబర్ 18. సమయం న్యూస్:** బోధన్ బస్టాండ్ ప్రాంతంలో గల బోధన్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ కు భవన యజమాని శరత్ కృష్ణ గురువారం ఉదయం ఆఫీసు తాళం వేశాడు. గత 36 నెలల నుండి తనకు రావలసిన. ఆఫీస్ తాలూకా కిరాయి మొత్తం 28 లక్షల రూపాయలు. ఇవ్వటం లేదని ఆఫీసుల చుట్టూ తిరిగి . వేచారిపోయి ఈరోజు ఉదయం ఆఫీసుకు. తాళం వెయ్యటం జరిగింది . ఈ విషయంలో ఇన్స్పెక్టర్ జనరల్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్. సంప్రదించగా రెండు మూడు నెలల్లో భవన యజమానికి చెల్లించవలసిన అద్దె చెల్లిస్తామని. ప్రభుత్వ ఫైనాన్స్ పరిస్థితి బాగోలేదు. అర్థం చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా రిజిస్టర్ ఆఫీసు ద్వారానే పరాశ ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయినా కానీ వాటికి చెల్లించాల్సిన కిరాయిలు కూడా చెల్లించకపోవడం శోచనీయం. ఉదయం నుండి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

## పియంవిబిఆర్వైని వినియోగించుకోండి

**ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్**

**ఖమ్మం సెప్టెంబర్ 18:( సమయం న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన(పీయంవిబిఆర్వై) పథకాన్ని 2025 ఆగస్టు 1 నుండి ప్రారంభించినట్లు, అవసరమైన ఉద్యోగులు, యాజమాన్యులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ వైడి. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి అవకాశాలను పెంపొందించడం, యువతలో ఉపాధి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, సామాజిక భద్రతను మెరుగు పరచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. ఈ పథకం క్రింద కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి ఒక నెల జీతం (గరిష్టంగా ₹15,000) రెండు విడతలుగా నేరుగా ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, అదేవిధంగా, కొత్త ఉద్యోగులను నియమించే తయారీ రంగం యజమానులకు ప్రతీ ఉద్యోగి పైన నెలకు 3 వేల వరకు ప్రోత్సాహకం 2 సంవత్సరాల పాటు అందజేయబడుతుందని, తయారీ రంగానికి ఈ సౌకర్యాలు నాలుగేళ్లపాటు వర్తిస్తాయని వివరించారు. యజమానులు తప్పనిసరిగా ఎంప్లాయర్ పోర్టల్ లోని పీయంవిబిఆర్వై లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచిస్తూ, మరిన్ని వివరాల కోసం వరంగల్ పీఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వైడి. శ్రీనివాస్ సూచించారు.

## బాన్సువాడలో సేవా పత్వాడ్



**కామారెడ్డి , సెప్టెంబర్ 18,(సమయం న్యూస్):** భారత ప్రధాని గౌరవ శ్రీ నరేంద్ర మోడీ గారి జన్మదినం సందర్భంగా గురువారం బాన్సువాడ పట్టణ కేంద్రంలోని బస్టాండ్‌లో సేవా పత్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి, బస్టాండ్ పరిసరాల్లోని చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ వేసి నీటితో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా నీలం చిన్నరాజులు మాట్లాడుతూ, నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని, ఆయన ప్రధాని పదవికి వన్నె తెచ్చారని పేర్కొన్నారు. ఇటీవల జీఎస్టీ స్లాబ్ తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం లభిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే డబుల్ బెడ్‌రూమ్ స్కీమ్‌లో కేంద్రం రూ. 1,29,000 నిధులు అందజేస్తోందని తెలిపారు. మోడీ గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం లో అవినీతి పెరిగిందని,ప్రజలే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ఎలాంటి రాజీ లేకుండా పోరాటం చేయాలని సూచించారు. మోడీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కోణాల గంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, కిషన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, బిజెపి రూరల్ అధ్యక్షులు మజ్జిగ శ్రీనివాస్, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు తృప్తి ప్రసాద్, సున్నం సాయిలు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యక్షులు గజ్జల మహేష్, అనిల్ సాయి దత్తు, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల రాజు, బీజేవైఎం మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రాజా సింగ్, అలాగే బిజెపి నాయకులు అశ్విన్, విశాల్ సాయి రెడ్డి, నాగరాజు, సంతోష్, లక్ష్మణ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి**



**ఖమ్మం , సెప్టెంబర్ 18 ( సమయం న్యూస్ ):** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ సర్దార్ హుస్సేన్ , ప్రధాన కార్యదర్శి జంగిపల్లి రవి డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు, యువతకు రాజీవ్ యువ వికాసం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు హామీ ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం గురించి , సమావేశంలో చర్చించమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పథకాల అమలు జరుగుతున్నప్పటికీ అర్హులను గుర్తించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని విమర్శించారు. గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలు అర్హులను గుర్తించడంలో విఫలం చెందాయని ఆరోపించారు.హో ఇంకా గ్రామాలలో క్రింది స్థాయి వర్గాల ప్రజలు కనీసం ఉండటానికి కూడా ఇల్లు లేనటువంటి వాళ్ళు చాలామంది ఉన్నారు వాళ్ళని గుర్తించటానికి గ్రామ అధికారులకి హక్కులు కల్పించాలనీ డిమాండ్ చేశారు. తక్షణమే ఇందిరమ్మ కమిటీలను రద్దుచేసి నిరుపేదలకు తమ ఇంటి కలలను నిజం చేసుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు హామీ ఇచ్చినట్టుగానే త్వరితగతిన 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డు ఇచ్చి, లాల్ తక్షణమే కాంగ్రెస్‌కు 10 లక్షల వరకు హెల్త్ కార్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు.

### పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

తెలంగాణ జన సమితి పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నటువంటి పథకాల పైన సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది, ఇందులో ప్రధానంగా ఇందిరమ్మ ఇల్లు, యువతకు రాజీవ్ యువ వికాసం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు హామీ ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం గురించి చర్చించడం జరిగింది, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పథకాల అమలు జరుగుతున్నప్పటికీ అర్హులను గుర్తించడంలో అలసత్వం వహిస్తున్నారు,ఇందిరమ్మ ఇల్లు పథకం అమలైనప్పటికీ కింది స్థాయిలో గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలు అర్హులను గుర్తించడంలో విఫలమయ్యారు, ఇంకా గ్రామాలలో క్రింది స్థాయి వర్గాల ప్రజలు కనీసం ఉండటానికి కూడా ఇల్లు లేనటువంటి వాళ్ళు చాలామంది ఉన్నారు వాళ్ళని గుర్తించటానికి గ్రామ అధికారులకి హక్కులు కల్పించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను రద్దుచేసి పేదలైన నిరుపేదలకు తమ ఇంటి కలలను నిజం చేసుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిప్పర్తి రామాచారి, టీజేఎస్ పార్టీ నగర నాయకులు దేవళ్ళ నాగేశ్వరరావు, టీజేఎస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఆరంపుల లక్ష్మణరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ను తక్షణమే పూర్తి చేయాలి

**రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ ఆదేశం**

**వికారాబాద్, సెప్టెంబర్,18 (సమయం న్యూస్):** వికారాబాద్ గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ, మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సమయానికి అందజేయాలని కోరారు. అలాగే మిల్లర్లు తమకు అప్పగించిన ధాన్యం పరిమాణానికి తగినట్టుగా బియ్యం సరఫరా చేసుకోవాలని, తమ బాధ్యతగా భావించాలని ఆయన మిల్లర్లకు సూచించారు. బ్యాంకు గ్యారంటీ లేకుండా ప్యాడి ఇవ్వడానికి వీలు లేదని, తప్పనిసరిగా బ్యాంక్ గ్యారంటీ ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా,గ్యాప్ ఎక్కడ కూడా లేకుండా చూడాలన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు. గోదాముల్లో సరైన తరలింపు కోసం తగినంత మంది హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆయన కోరారు. జిల్లాలో స్థల కొరత ఉండకుండా గోదామును ప్రత్యామ్నాయంగా వినియోగించేందుకు ఎఫ్‌సీఐ చర్యలు తీసుకోవాలని, అలాగే బియ్యం నిల్వ మరియు రవాణా సులభతరం చేసేందుకు రైల్వే వ్యాగన్ ల కేటాయింపు పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో,జిల్లా పౌర సరఫరాల మేనేజర్ మోహన్ కృష్ణ,జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్ ,శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.





## మహిళల ఆరోగ్యంపై దృష్టి

**ముషీరాబాద్, సెప్టెంబర్ 18 (సమయం న్యూస్) :** ముషీరాబాద్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్య సేవలను అందించే ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని స్థానిక మహిళలకు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు, బిడ్డల పోషణ, ప్రసూతి ముందు %-% తరువాత జాగ్రత్తలు, అలాగే సాధారణ వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ప్రతి ఒక్కరికీ అవసరమైన సలహాలు అందించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ "ప్రజల ఆరోగ్యంపై నిరంతర దృష్టి పెట్టి, ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇలాంటి శిబిరాల ద్వారా వైద్య సిబ్బంది సేవలు అందించడం ప్రశంసనీయం" అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రత్నమాల, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్స్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, గర్భిణీలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

19-09-25 Samayam_Layout 1 9/19/2025 5:35 AM Page 11



# గ్రూప్-బీలో సూపర్-4కు చేరేదెవరో?

## క్వాలిఫికేషన్ కోసం తీవ్ర ఉత్కంఠ

ఆసియా కప్ 2025లో లీగ్ దశ ముగింపుకు చేరుకోవడంతో గ్రూప్-బీలోని మూడు జట్ల మధ్య సూపర్-4 క్వాలిఫికేషన్ కోసం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే గ్రూప్-ఏ నుంచి భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తమ స్థానాలను పదిలం చేసుకున్నాయి. గ్రూప్-బీలో మాత్రం సూపర్-4 క్వాలిఫికేషన్ జట్ల గురించి ఇంకా స్పష్టత రాలేదు. బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న ఈ రేసులో ప్రతి బంతి, ప్రతి పరుగు ఎంతో కీలకమైనది. నేడు శ్రీలంక, అఫ్గానిస్తాన్ మధ్య జరుగునున్న మ్యాచ్‌తో గ్రూప్-బీలో అర్హత సాధించే జట్ల భవితవ్యం నిర్ణయం కానుంది. గ్రూప్-బీలో మూడు జట్లలో ఒక్కొక్కరికి వారి అర్హత అవకాశాలు వేర్వేరుగా ఉన్నాయి. బంగ్లాదేశ్ తమ అన్ని లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసింది. ఇప్పుడు వారి భవితవ్యం శ్రీలంక, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య నేడు జరగబోయే మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంది. బంగ్లాదేశ్ తన లీగ్ మ్యాచ్‌లన్నీ పూర్తి చేసుకుని తమ భవితవ్యం కోసం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడుతోంది. శ్రీలంక గనుక అఫ్గానిస్తాన్‌ను ఓడిస్తే బంగ్లాదేశ్ సూపర్-4లోకి వెళ్తుంది. కానీ అఫ్గానిస్తాన్ గెలిస్తే బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. అందుకే బంగ్లాదేశ్ అభిమానులు శ్రీలంక విజయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అఫ్గానిస్తాన్ గనుక శ్రీలంకను 70 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో ఓడిస్తే, బంగ్లాదేశ్ నెట్ రన్ రేట్ శ్రీలంక కంటే మెరుగ్గా ఉంటుంది. ఈ పరిస్థితిలో బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ రెండూ క్వాలిఫై అవుతాయి. అఫ్గానిస్తాన్ క్వాలిఫికేషన్ సమీకరణం చాలా సులభంగా ఉంది. కానీ వారికి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అఫ్గానిస్తాన్ శ్రీలంకను ఏ తేడాతో ఓడించినా, వారి నెట్ రన్ రేట్ బంగ్లాదేశ్ కంటే మెరుగ్గా ఉన్నందున శ్రీలంకతో కలిసి సూపర్-4లో అడుగుపెడుతుంది 70 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల తేడాతో గెలిచినా, లేదా లక్ష్యాన్ని 50 లేదా అంతకంటే ఎక్కువ బంతులు మిగిలి ఉండగానే ఛేదించినా, అఫ్గానిస్తాన్ బంగ్లాదేశ్‌తో కలిసి అర్హత సాధిస్తుంది. ఈ టోర్నీలో శ్రీలంక ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. వారి క్వాలిఫికేషన్ అవకాశాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, వారు జాగ్రత్తగా ఉండాలి. శ్రీలంక అఫ్గానిస్తాన్‌ను ఏ తేడాతో ఓడించినా, వారు గ్రూప్ టాపర్‌గా నిలిచి బంగ్లాదేశ్‌తో కలిసి సూపర్-4కు వెళ్తారు. ఒకవేళ శ్రీలంక ఓడిపోయినా, ఓటమి తేడా 70 పరుగుల కంటే తక్కువగా ఉండాలి. అలా జరిగితే, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది, శ్రీలంక, అఫ్గానిస్తాన్ క్వాలిఫై అవుతాయి. అఫ్గానిస్తాన్ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు, శ్రీలంక వారు 12.2 ఓవర్లలోపు (అంటే 46 బంతులు మిగిలి ఉండగానే) లక్ష్యాన్ని పూర్తి చేయకుండా జాగ్రత్త పడాలి. అలా జరిగితే శ్రీలంక నెట్ రన్ రేట్ దెబ్బతిని క్వాలిఫికేషన్ కష్టం అవుతుంది.



# ఐసీసీ నెం.1 బౌలర్‌గా నిలిచిన వరుణ్ చక్రవర్తి



భారత ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తానం ఆసక్తికరంగా సాగింది. నాలుగేళ్ల కిందట యూఏఈలో జరిగిన టీ20 ప్రపంచకప్ 2021 మ్యాచ్ లో పాకిస్థాన్ చేతిలో ఘోర ప్రదర్శన చేసి జట్టు నుంచి ఉద్వాసనకు గురైన వరుణ్.. ఆ తర్వాత మూడేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ కు ఆడలేకపోయాడు. అయితే గత ఏడాది నవంబర్ నుంచి అంతర్జాతీయ టీ20ల్లోకి రీ ఎంట్రీ ఇచ్చి సత్తా చాటుతున్నాడు. కేవలం పది నెలల్లోనే ఈ ఫార్మాట్లో నెం.1 స్తానాన్ని దక్కించుకున్నాడు. తాజా ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో తను నెంబర్ వన్ పొజిషన్ కు చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించి మూడో భారత బౌలర్ గా రికార్డులకెక్కాడు. గతంలో స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ మాత్రమే ఈ శిఖర స్తానాన్ని చేరుకుని, చరిత్ర సృష్టించారు. తాజాగా ఆ జాబితాలోకి వరుణ్ చేరుకోవడం పట్ల భారత అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. నిజానికి 2021 ప్రపంచకప్ లో తొలిసారి పాక్ చేతిలో ఇండియా ఓడిపోయింది. ఆ మ్యాచ్ లో ఏకంగా పది వికెట్ల తేడాతో ఇండియా పరాజయం పాలై, ఆ తర్వాత ఏకంగా టోర్నీ నుంచే లీగ్ దశలో నిష్క్రమించింది. ఇక ఈ మ్యాచ్ లో బౌలింగ్ చేసిన వరుణ్ పై చాలా విమర్శలు వచ్చాయి. మిస్టరీ స్పిన్నర్ గా బరిలోకి దిగిన వరుణ్ ను పాక్ ప్లేయర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. దీంతో తన కంటే తమ గల్లీ బౌలర్లు బాగా బౌలింగ్ చేస్తారని, తను మిస్టరీ స్పిన్నర్ అనడం జోక్ గా ఉందని పలువురు పాక్ మాజీ లు వేళాకోళం చేశారు. అయితే అప్పటి అవమానం నుంచి బౌన్స్ బ్యాక్ అయిన వరుణ్.. సైలెంట్ గా సత్తా చాటాడు. గతేడాది నవంబర్ లో సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్ లో వరుణ్ ఆకట్టుకున్నాడు. అద్బుతమైన ఆటతీరుతో ఆ సిరీస్ లో మెరిశాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ తో జరిగిన టీ20ల్లోనూ సత్తా చాటాడు. ఫైవ్ వికెట్ హాల్ ప్రదర్శన తోనూ తన సత్తా చాటాడు. ఆ తర్వాత ఏకంగా వన్డే జట్టులోకి వచ్చి, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ సాధించిన భారత జట్టులో సభ్యునిగా కీలకంగా మారాడు. ఈ క్రమంలో టీ20, వన్డే జట్టులో తన స్తానాన్ని పదిలం చేసుకున్నాడు. తాజాగా యూఏఈలోనే జరుగుతున్న ఆసియా కప్ లో తొలి రెండు మ్యాచ్ ల్లో రెండు వికెట్లు తీసి, నెం.1 బౌలర్ హెూదాను దక్కించుకున్నాడు. నాడు యూఏఈలో హ్యుమిలేషన్ కు గురైన వరుణ్.. తాజాగా అదే గడ్డపై అటు చాంపియన్స్ ట్రోఫీ, ఇటు నెం.1 బౌలర్ కిరీటాలను ధరించాడు. రాబోయే రోజుల్లో టీమిండియా ఆడే మూడు ఫార్మాట్లలోనూ తను సభ్యునిగా కావాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

# పతకం లేకుండానే నిష్క్రమించిన అథ్లెట్లు

ప్రపంచ అథ్లెటిక్స్‌లో 2025 ఫైనల్స్?లో భారత జావెలిన్ త్రోయర్స్ నీరజ్ చోప్రా, సచిన్ యాదవ్ నిరాశపర్చారు. గురువారం జరిగిన ఫైనల్?లో అత్యుత్తమంగా ప్రదర్శన కనబర్చినప్పటికీ ఈ ఇద్దరూ పతకం లేకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించారు. సచిన్ ఆశలు రేకెత్తించినా, 4న స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకున్నాడు. మరోవైపు నీరజ్ 8వ స్థానానికి పరిమితం అయ్యాడు. ఇక పారిస్ ఒలింపిక్స్? గోల్డ్ మెడల్ విజేత పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ కూడా పతకం లేకుండానే టోర్నీని ముగించాడు. అతడు 10వ స్థానానికి పరిమితం అయ్యాడు. స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా ఈ పోటీలో సాధించిన బెస్ట్ త్రో 84.03 మీటర్లు. దీంతో అతడు 8 ప్లేస్?కు పరిమితమై పతకం లేకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించాడు. అయితే 2021లో టోక్యో ఒలింపిక్స్ తర్వాత, నీరజ్ చోప్రా పతకం లేకుండా ఏ ఈవెంట్‌నూ ముగించలేదు. గత నాలుగేళ్లలో మెడల్ సాధించకుండా టోర్నీ నుంచి నీరజ్ నిష్క్రమించడం ఇదే తొలిసారి. అలాగే ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 10వ స్థానంలో నిలిచాడు. భారత మరో అథ్లెట్ సచిన్ యాదవ్ ఈ ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకున్నాడు. 86.27 మీటర్లు వ్యక్తిగత అత్యుత్తమ త్రో విసిరాడు.




**ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ త్రోలో గత విజేతల జాబితా ఇదే..**

1983-హెల్సింకి(వేదిక)-డెట్లెఫ్ మైఖేల్ (తూర్పు జర్మనీ)
1987-రోమ్-సెప్పో రాటీ (ఫిన్లాండ్)
1991-టోక్యో-కిమ్మో కిన్నునెన్ (ఫిన్లాండ్)
1993-స్టట్‌గార్ట్-జాన్ జెలెజ్నీ (చెక్ రిపబ్లిక్)
1995-గోథెన్‌బర్గ్-జాన్ జెలెజ్నీ (చెక్ రిపబ్లిక్)
1997-ఏథెన్స్-మారియస్ కార్బెట్ (దక్షిణ ఆఫ్రికా)
1999- సెవిల్లే-అకీ పార్వియైనెన్ (ఫిన్లాండ్)
2001-ఎడ్మంటన్- జాన్ జెలెజ్నీ (చెక్ రిపబ్లిక్)
2003-సైంట్-డెనిస్- సెర్గీ మకరోవ్ (రష్యా)
2005-హెల్సింకి-ఆండ్రస్ వర్నిక్ (ఎస్టోనియా)
2007-ఒసాకా-టెరో పిట్‌కమాకీ (ఫిన్లాండ్)
2009-బెర్లిన్-ఆండ్రియాస్ థోర్కిల్డ్‌సెన్ (నార్వే)
2011-డేగు-మతియాస్ డి జోర్డో (జర్మనీ)
2013-మాస్కో-విటెజ్స్లావ్ వెసెలీ (చెక్ రిపబ్లిక్)
2015-బీజింగ్-జూలియస్ యెగో (కెన్యా)
2017-లండన్-జోహాన్నెస్ వెట్టర్ (జర్మనీ)
2019 -దోహా-ఆండర్సన్ పీటర్స్ (గ్రెనడా)
2022 -యూజీన్-ఆండర్సన్ పీటర్స్ (గ్రెనడా)
2023-బుడాపెస్ట్- నీరజ్ చోప్రా (భారత్)
2025-టోక్యో-కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో)

# ఫామ్ కోల్పోయి ఇబ్బందులు పడుతున్న శ్రేయాస్ అయ్యర్

టీమిండియాలో తిరిగి స్థానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ కోల్పోయి కష్టాలు పడుతున్నాడు. లక్నోలో ఆస్ట్రేలియా-ఎతో జరిగిన మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా-ఎ కెప్టెన్ అయిన శ్రేయాస్ అయ్యర్ మళ్లీ జట్టును నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా స్పిన్నర్ కోరీ రోచిచియోలీ బౌలింగ్‌లో కేవలం 13 బంతుల్లోనే 8 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌కు ముందు కూడా దులీప్ ట్రోఫీలో అతను పెద్దగా రాణించలేకపోయాడు. శ్రేయాస్ అయ్యర్ గత మూడు ఇన్నింగ్స్‌లలో పెద్దగా స్కోర్ చేయలేకపోయాడు. దులీప్ ట్రోఫీ 2025లో సెంట్రల్ జోన్‌పై వెస్ట్ జోన్ తరపున ఆడుతూ, మొదటి ఇన్నింగ్స్‌లో 25 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 12 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ నిరాశాజనకమైన ఫామ్ ఆస్ట్రేలియా-ఎతో మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఇది అతని టీమిండియాలో స్థానంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయ్యర్ విఫలమైనప్పటికీ.. ఇండియా-ఎ జట్టులోని నలుగురు బ్యాట్స్‌మెన్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. వారు హాఫ్ సెంచరీ సాధించి జట్టుకు బలమైన పునాది వేశారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ నారాయణ్ జగదీషన్ 113 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్సర్‌తో 64 పరుగులు చేశాడు. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ 44 పరుగులు చేసి, జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. సాయి సుదర్శన్ 124 బంతుల్లో 10 ఫోర్ల సహాయంతో 73 పరుగులు సాధించాడు. దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురేల్ కూడా హాఫ్ సెంచరీలు పూర్తి చేసి క్రీజులో నిలిచారు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో ఇండియా-ఎ జట్టు స్కోర్ 400 పరుగుల దగ్గరకు చేరుకుంది. మ్యాచ్ జరిగే సమయానికి, భారత్ 4 వికెట్ల నష్టానికి 383 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా-ఎ బ్యాట్స్‌మెన్లు ఆధిపత్యం కనబరిచారు. వారు 6 వికెట్ల నష్టానికి 532 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. వారి జట్టులోని ఇద్దరు బ్యాట్స్‌మెన్లు సెంచరీలు సాధించారు. అయినప్పటికీ, ఇండియా-ఎ బ్యాట్స్‌మెన్లు కూడా ధీటుగా బదులిచ్చారు.. కానీ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ మాత్రం భారత జట్టుకు ఆందోళన కలిగించే విషయం.






# ఐపీఎల్ జట్లు కూడా పాకిస్థాన్‌ను ఓడించగలవు

**మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు**

ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టీమిండియా సాధించిన అద్భుతమైన విజయం అనంతరం పాక్ జట్టుపై విమర్శల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సంచలన వ్యాఖ్యలు చేస్తూ పాకిస్థాన్ జట్టును తీవ్రంగా ఏకిపారేశారు. ఈ వ్యాఖ్యలు తరచూ భారత జట్టుపై విమర్శలు చేసే షాహిద్ అఫ్రిదికి గట్టి సమాధానం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్ పాకిస్థాన్ జట్టు బలహీనతను ఎత్తి చూపారు. భారతదేశంలో ఉన్న చాలా డొమెస్టిక్ జట్లు.. ఉదాహరణకు ముంబై, పంజాబ్ వంటి జట్లు కూడా పాకిస్థాన్ జట్టును ఓడించగలవని ఆయన అన్నారు. అంతే కాకుండా చాలా ఐపీఎల్ జట్లు కూడా పాకిస్థాన్ ను ఈజీగా ఓడించగలవని పేర్కొన్నారు. ఈ కామెంట్స్‌తో పాకిస్థాన్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడడానికి ఇంకా చాలా మెరుగుపడాల్సిన అవసంరం ఉందని ఇర్ఫాన్ పఠాన్ సూచించారు. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుతంగా రాణించి పాకిస్థాన్ జట్టును కేవలం 127 పరుగులకే కట్టడి చేశారు. పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్‌లో షాహీన్ అఫ్రిది మినహా ఎవరూ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. అనంతరం భారత బ్యాటర్లు లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే ఛేదించి విజయఢంకా మోగించారు. అభిషేక్ శర్మ తొలి రెండు బంతుల్లోనే 10 పరుగులు చేసి మ్యాచ్ పై తమ పట్టును చూపించారు. ఈ గెలుపు భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచగా.. పాకిస్థాన్ జట్టు తమ ఆటతీరుపై ఆలోచించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

# భారత్‌కు మా క్రికెట్‌ను కూల్చే శక్తి ఉంది

## పీసీబీ మాజీ చైర్మన్ రమీజ్ రాజా



ఆసియా కప్ 2025లో భాగంగా పాకిస్థాన్, భారత్ మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంపై జరిగిన వివాదం అనంతరం మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలని పీసీబీ చేసిన డిమాండ్ పాక్ క్రికెట్లో పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఈ వివాదంపై పీసీబీ మాజీ ఛైర్మన్ రమీజ్ రాజా కూడా స్పందించి బీసీసీఐపై ఆరోపణలు చేశారు. అయితే ఆయనే గతంలో భారత్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(%ూజదీ%) ఛైర్మన్ గా ఉన్న సమయంలో రమీజ్ రాజా భారత్‌ను ప్రశంసించారు. 2021లో రమీజ్ రాజా మాట్లాడుతూ.. "ఐసీసీ ఒక రాజకీయ సంస్థ. ఐసీసీ ఆదాయంలో 90 శాతం భారత్ నుంచే వస్తుంది. పీసీబీకి వచ్చే నిధుల్లో 50 శాతం ఐసీసీ నుంచే వస్తుంది. భారత్‌లోని వ్యాపార సంస్థలే పాకిస్థాన్ క్రికెట్‌ను నడుపుతున్నాయి. రేపు భారత ప్రధాని ఒక నిర్ణయం తీసుకుని పాకిస్థాన్‌కు ఎటువంటి నిధులు ఇవ్వకుండా ఆపేస్తే, ఈ క్రికెట్ బోర్డు కుప్పకూలిపోతుంది" అని రమీజ్ రాజా చెప్పారు అయితే ఇప్పుడు అదే రమీజ్ రాజా బీసీసీఐని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. భారత్-పాక్ మ్యాచ్ అనంతరం జరిగిన వివాదానికి పైక్రాఫ్ట్ కారణమని ఆరోపించారు. ఒకప్పుడు భారత క్రికెట్ శక్తిని పొగిడిన ఆయన ఇప్పుడు మాట మార్చడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలనే పీసీబీ డిమాండ్ ను ఐసీసీ పట్టించుకోలేదు. ఈ క్రమంలో పాకిస్థాన్ జట్టు యూఏఈతో మ్యాచ్ ఆడి, కష్టపడి గెలిచి సూపర్-4కు చేరింది. ఈ విజయంతో సెప్టెంబర్ 21 దుబాయ్‌లో మళ్లీ భారత్‌తో తలపడనుంది. ఓ వైపు మ్యాచ్‌లకు ముందు వివాదాలు.. మరోవైపు పాక్ జట్టు ఆటతీరుపై ప్రశ్నలు ఉన్నప్పటికీ.. ఈ మొత్తం డ్రామా చివరకు ఇరు జట్ల మధ్య మరో రసవత్తరమైన పోరుకు దారి తీసింది.

# కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా


## దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి

ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం 'దక్ష' 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్' విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు- రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.



# ఓజీ నుంచి ప్రకాశ్ రాజ్ పోస్టర్ విడుదల

పవన్ కల్యాణ్ హీరోగా 'ఓజీ' సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన 'సత్య దాదా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఓజీ' రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.





# కల్కి-2 నుంచి తప్పుకున్న దీపిక

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్-2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు- ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీ-వల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు- కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.





# కీర్తికి మరో మహానటి పడాల్సిందే..?

సౌత్ స్టార్ హీరోయిన్స్ లో ఒకరైన కీర్తి సురేష్ ఆఫ్టర్ మ్యారేజ్ కెరీర్ లో కాస్త వెనకపడింది. సినిమాలు సక్సెస్ అవ్వకపోవడం అందుకు ఒక రీజన్ అయితే పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ తీసుకోవడం అనేది కూడా మరో రీజన్ అవుతుంది. పెళ్లి తర్వాత అమ్మడి నుంచి వచ్చిన బేబీ జాన్, అమెజాన్ ప్రైం లో వచ్చిన ఉప్పు కప్పురంబు సినిమాలు నిరాశపరిచాయి. కీర్తి రేంజ్ కి తగిన సినిమాలు కాదనే టాక్ వచ్చింది. కీర్తి సురేష్ ప్రస్తుతం రివాల్వర్ రీటా సినిమా ఆగష్టు 27 రిలీజ్ అన్నారు కానీ అది రిలీజైంది లేదన్నది తెలియదు. అసలేమాత్రం బజ్ లేకుండా సినిమా రిలీజ్ చేసి ఉండకపోవచ్చు. ఇదిలా ఉంటే కీర్తి సురేష్ ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్ సినిమా చేస్తుంది. అదే కాకుండా వేణు యెల్దండి చేసే ఎల్లమ్మ లో కూడా కీర్తి సురేష్ లీడ్ రోల్ అని టాక్. ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ నటిస్తుందని తెలిస్తే మాత్రం కచ్చితంగా ఆమెకు మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చే ఛాన్స్ దొరికినట్టే. ఆ సినిమాలో సాయి పల్లవి, కీర్తి సురేష్ ఇద్దరిలో ఒకరికి నటించే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. ఐతే ఆ అవకాశాన్ని కీర్తి సురేష్ అందుకుందని టాక్. కీర్తి సురేష్ కెరీర్ లో మహానటి ఒక గొప్ప సినిమా. ఆ సినిమాలో ఆమె అభినయం ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసింది. ఆ సినిమాతో కీర్తి సురేష్ కెరీర్ లో ఫస్ట్ టైం బెస్ట్ యాక్ట్రెస్ గా నేషనల్ అవార్డ్ సైతం తెచ్చుకుంది. సో మళ్లీ ఆమె కెరీర్ లో మరో మహానటి సినిమా పడాలి. అప్పుడే కీర్తి సురేష్ తిరిగి బిజీ అయ్యే ఛాన్స్ ఉంటుంది. కీర్తి సురేష్ కూడా అదే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తుంది. కీర్తి సురేష్ లో ఒక కంప్లీట్ యాక్ట్రెస్ ఉంటుంది. అటు ట్రెండీగా కనిపిస్తూనే ఇటు విలేజ్ బ్యాక్ డ్రాప్ లో ఏదైనా రోల్ చేయమన్నా చేస్తుంది. ముఖ్యంగా తన అభినయంతో క్యారెక్టర్ కు 100 శాతం న్యాయం చేస్తుంది. అందుకే కొన్ని కథలకు కొంతమంది ఆర్టిస్టులు మాత్రమే న్యాయం చేస్తారనేలా ఎంపిక జరుగుతుంది. సౌత్ లోనే కాదు బాలీవుడ్ నుంచి కూడా కీర్తి సురేష్ కి మరో ఛాన్స్ వచ్చిందని టాక్. ఆ సినిమాకు సంబంధించిన డీటైల్స్ కూడా త్వరలో తెలుస్తాయి.

# కిస్ మూవీ ట్రైలర్ విడుదల

తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కిస్'. 'దాదా' సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి 'ప్రీతి' అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు- హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.





# ఎఎన్నార్ 101 జయంతి స్పెషల్

## డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం రీ-రిలీజ్

## థియేటర్లలో ఉచితంగా ప్రదర్శన

దివంగత అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా అభిమానులకు ప్రత్యేక బహుమతి సిద్ధమైంది. ఆయన నటించిన సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రాలు డాక్టర్ చక్రవర్తి, ప్రేమాభిషేకం మళ్లీ పెద్ద తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఎంపిక చేసిన థియేటర్లలో అది కూడా ఉచిత టిక్కెట్లతో ప్రదర్శించనున్నారు. ఇది నిజంగా అభిమానుల్లో విశేష ఆనందాన్ని కలిగిస్తోంది.

ఈ రెండు ప్రసిద్ధ చిత్రాలు సెప్టెంబర్ 20 నుంచి మళ్లీ రీ-రిలీజ్ అవుతున్నాయి. పెద్ద తెరపై ఏఎన్ఆర్ మాయాజాలాన్ని మళ్లీ ఆస్వాదించే అరుదైన అవకాశం ఇది. ఈ ప్రత్యేక ప్రదర్శనలకు టిక్కెట్లు- బుక్ మై షో లో ఉచిత రిజర్వేషన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ థియేటర్లలో ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో వైజాగ్‌లో క్రాంతి థియేటర్, ఒంగోలులో స్వర్ణ ప్యాలెస్, విజయవాడలో కృష్ణ టాకీస్, అలాగే హైదరాబాద్‌లోని ఒక ప్రసిద్ధ థియేటర్ కూడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరిన్ని కేంద్రాలను జోడించే అవకాశం ఉందని సమాచారం. ఏఎన్ఆర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆయన నటన, సిల్వర్ స్క్రీన్‌పై సృష్టించిన మాయాజాలాన్ని అభిమానులు మరోసారి ఆస్వాదించనున్నారు. అభిమానులు తమ తమ నగరాల్లోని థియేటర్లకు వెళ్లి, కుటుంబసభ్యులతో కలిసి ఈ క్లాసిక్ సినిమాలను చూసి ఆనందించాలని పిలుపునిచ్చారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**